తరంగాలు
రిపోర్టర్లు కావలెను
అతి తక్కువ కాలంలో తెలుగు రాష్ట్రాల్లో అత్యంత ప్రజాదరణ పొందుతున్న ' తరంగాలు ' జాతీయ దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాలోని అన్ని మండలాల నుండి రిపోర్టర్లు కావలెను.
సంప్రదించండి...
ఎడిటర్: గడ్డం నాగరాజు గౌడ్
94949 23460

https://epaper.tharangalu.in
RNI. TELTEL / 2022 / 83463
జాతీయ దిన పత్రిక

# తరంగాలు

Tharangalu Daily News Paper
ప్రతి అక్షరం.... సామాన్యుడి అస్త్రం...

హైదరాబాద్
బుధవారం
29 జులై 2026
సంపుటి 03
సంచిక 288
పేజీలు 8
వెల రూ. 5.00

Published From : Hyderabad,Circulated:Telangana,Andhrapradesh
Epaper: www.tharangalu.in.com



## కీలక బిల్లులుపై ఎన్‌డిఎ ఎంపిలతో మోడీ చర్చ

- పార్లమెంట్ వ్యూహాలపై ప్రధాని దిశానిర్దేశం
- ఎన్‌డిఎ పక్ష ఎంపిలతో మంగళ్ మిలన్ భేటీ

న్యూఢిల్లీ,జూలై28 పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్న కీలక బిల్లులు, విపక్షాల వ్యూహాన్ని ఎదుర్కోవడం, ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం వంటి అంశాలపై ప్రధాని మోడీ విస్తృతంగా చర్చించారు. ప్రధాని నరేంద్ర మోదీ

మిగతా 2వ పేజిలో..

## హైదరాబాద్‌లో ఫేక్ కాల్ సెంటర్ స్కామ్

- కోట్ల రూపాయాల సైబర్ మోసం
- కీలక నిందితుడిని అరెస్ట్ చేసిన ఇడి

హైదరాబాద్,జూలై28 హైదరాబాద్ కేంద్రంగా నడిచిన అంతర్జాతీయ ఫేక్ కాల్ సెంటర్ స్కామ్‌లో కీలక నిందితుడిని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు అరెస్ట్ చేశారు. ప్రధాన సూత్రధారి వికాస్ కుమార్ నిమార్ అలియాస్ మిస్టీ.. అమెరికా పౌరులను లక్ష్యంగా చేసుకుని కోట్ల రూపాయల సైబర్ మోసానికి పాల్పడ్డాడు. దీంతో వికాస్‌ను ఈడీ అధికారులు అదుపులోకి తీసుకుని వైద్య పరీక్షల నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఫేక్ కాల్ సెంటర్‌కు సంబంధించి మాదాపూర్ పోలీసులు నమోదు చేసిన కేసు ఆధారంగా మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద ఈడీ అధికారులు దర్యాప్తు చేపట్టారు. ఇంటర్‌పోల్ ద్వారా అమెరికా ఎంబసీ అందించిన సమాచారంతో సీబీఐ గతంలోనే కేసు

మిగతా 2వ పేజిలో..

## హైడ్రా కార్యక్రమాలను కొనసాగిస్తాం..



- ఎవరు అధికారిగా ఉండాలో మాకు స్పష్టత ఉంది
- కబ్జాలు చేస్తే బడా బాబులైనా, పేదలైనా ఊరుకోం
- హైడ్రాపై కావాలనే తప్పడు ప్రచారాలు
- కావాలనే సోషల్ మీడియాతో దుష్ప్రచారాలు
- ఢిల్లీలో మీడియాతో సిఎం రేవంత్ రెడ్డి

న్యూఢిల్లీ,జూలై28 హైడ్రా పనులు కొనసాగించి తీరుతామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. కబ్జాకోర్లు మాత్రమే హైడ్రా వద్దంటున్నారని పేర్కొన్నారు. ఢిల్లీలో పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి మంగళవారం విలేకర్లతో మాట్లాడారు. కబ్జాలు చేస్తే బడా బాబులైనా, పేదలైనా ఊరుకోమని స్పష్టం చేశారు. గండిపేట,బతుకమ్మ కుంటలను ఆక్రమించింది పేదలా? పెద్దలా? అని విపక్షాలను ఆయన ప్రశ్నించారు. ఎన్ కన్వెన్షన్ పేదలదా? పెద్దలదా? అని వారిని నిలదీశారు. హైడ్రా తాము తీసుకొచ్చిన అతిపెద్ద సంస్కరణగా సీఎం అభివర్ణించారు. హైడ్రాకు ఉన్నతాధికారిగా ఎవరిని నియమించాలనే విచక్షణ తమ ప్రభుత్వానికి ఉందని కుండబద్దలు కొట్టారు. విశ్రాంత ఐఏఎస్ అధికారి సోమేశ్ కుమార్‌పైన 400 పైగా కోర్టు ధిక్కరణ కేసులున్నాయని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. దురుద్దేశంతోనే కేసులు వేసి

మిగతా 2వ పేజిలో..

# ప్రశ్నపత్రాల లీకేజీలకు కారకులను కఠినంగా శిక్షించాలి

- అప్పట్లో గ్లోబరీనాపై చర్యలు తీసుకోకపోవడంతో సమస్య
- గ్లోబరీనా అక్రమాలు సీబీఎస్‌ఈకీ విస్తరించాయి
- కేసీఆర్ పెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.8 వేల కోట్లు
- ఇకనుంచి సకాలంలో ఫీజుల చెల్లింపునకు చర్యలు
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడి



న్యూఢిల్లీ,జూలై28 ప్రశ్నపత్రాలలీకేజీలకు కారణమైన వాళ్లను కఠినంగా శిక్షించాలని ముఖ్యమంత్రి .రేవంత్ రెడ్డి అన్నారు. పరీక్షలను ఆన్‌లైన్‌లో నిర్వహించినప్పుడు పెద్దగా సమస్యలు లేవని, ఆఫ్‌లైన్‌లో నిర్వహించినప్పుడే సమస్యలు వస్తున్నాయ న్నారు. కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను కలిసిన అనంతరం సీఎం రేవంత్ రెడ్డి విలేకరులతో మాట్లాడారు. అనుమతి లేకుండానే దేశంలో కోచింగ్ కేంద్రాలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నా యని, అవి ప్రశ్నాపత్రాలు లీక్ అవ్వడానికి వేదికలుగా మారుతు న్నాయని సీఎం విమర్శించారు. ఈ విషయం లోజాతీయస్థాయిలో ఒక విధానాన్ని రూపొందించాల్సిన అవసరమున్నదని సీఎం అభిప్రాయపడ్డారు. యూనివర్సిటీల మీద ఆధిపత్యం

మిగతా 2వ పేజిలో..



## నీట్ అరెస్ట్‌లపై సుప్రీం కీలక ఆదేశాలు

- మైనర్లు, నేరచరిత లేని వారిని వదిలేయండి
- విద్యార్థులపై ఎలాంటి కఠిన చర్యలు తీసుకోవద్దని ఆదేశం

న్యూఢిల్లీ,జూలై28 పరీక్ష పేపర్ లీకేజీలపై దేశవ్యాప్తంగా జరిగిన నిరసనల్లో అరెస్టయిన విద్యార్థుల విషయంలో సుప్రీంకోర్టు మంగళవారం కీలక ఆదేశాలు జారీ చేసింది. 18 ఏళ్లలోపు మైనర్లు, అలాగే ఎలాంటి నేరచరిత్ర లేని విద్యార్థులను వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. కాక్రోచ్ జనతా పార్టీ నేతృత్వంలో ఢిల్లీలోని జంతర్ మంతర్ సహా పలు రాష్ట్రాల్లో జరిగిన ఆందోళనల్లో పాల్గొన్న విద్యార్థులపై నమోదైన ఎఫ్ఐఆర్‌లకు సంబంధించి, వారిపై ఎలాంటి కఠిన చర్యలు తీసుకోవద్దని అత్యున్నత న్యాయస్థానం తన తాత్కాలిక ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది నీట్ పరీక్ష పేపర్ లీక్ అంశంపై దేశవ్యాప్తంగా సాగిన నిరసనల సమయంలో, విద్యార్థులపై పోలీసులు జరిపిన లాఠీఛార్జ్, దౌర్జన్యాలపై సుప్రీంకోర్టు

మిగతా 2వ పేజిలో..


## పరీక్షల సంస్కరణల బిల్లుకు మద్దతు ఇస్తాం

- గతంలో జరిగిన తప్పులపై వివరణ ఇవ్వాల్సిందే
- మహిళా బిల్లుతో డీలిమిటేషన్ చేర్చి గందరగోళం చేస్తున్నారు
- అధికారంలోకి రాగానే హైడ్రాను బంగాళాఖాతంలో వేస్తాం
- మీడియా సమావేశంలో బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్



న్యూఢిల్లీ,జూలై28 మంచి ఉద్దేశంతో పరీక్షల సంస్కరణల బిల్లు తీసుకొస్తే బీఆర్ఎస్ మద్దతు ఇచ్చి స్వాగతిస్తుందని ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ స్పష్టం చేశారు. మంగళవారం

మిగతా 2వ పేజిలో..



## నగరంలో భారీ వర్షం

- లోతట్టు ప్రాంతాలు పూర్తిగా జలమయం
- ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం

హైదరాబాద్,జూలై28గ్రేటర్ హైదరాబాద్‌లో మంగళవారం సాయంత్రం వర్షం దంచికొట్టింది. ఆఫీసుల నుంచి ఇళ్లకు వెళ్లే సమయంలో వర్షం కురవడంతో ట్రాఫిక్‌కు

మిగతా 2వ పేజిలో..

## బిఆర్‌ఎస్ పాలనపై కవిత క్షమాపణలు స్వాగతిస్తున్నాం

**కెసిఆర్ అసెంబ్లీకి వస్తే గౌరవిస్తాం: శ్రీధర్ బాబు**



హైదరాబాద్,జూలై28 బీఆర్ఎస్ పాలనపై టీఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత క్షమాపణలు చెప్పడాన్ని స్వాగతిన్తున్నామని పరిశ్రమలు, ఐటీ శాఖల మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. గత పాలకులు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేయాలని కవితకు ఆయన స్పష్టం చేశారు. మంగళ వారం హైదరాబాద్‌లో మంత్రి శ్రీధర్ బాబు మీడియాతో ఇష్టాగోష్టిగా మాడారు. బీఆర్ఎస్ నేతలు డబుల్ 420 అని అభివర్ణించారు.బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ అసెంబ్లీకి రావాలని తాము కోరుకుంటు న్నామని అన్నారు. అసెంబ్లీకి వస్తే ఆయన మర్యాదకు ఇబ్బంది రానివ్వమని శ్రీధర్ బాబు పేర్కొన్నారు. హైడ్రా మంచిదని సాధారణ ప్రజలు

మిగతా 2వ పేజిలో..

# కీలక బిల్లులుపై ఎన్‌డిఎ ఎంపిలతో మోడీ చర్చ

అధ్యక్షతన మంగళవారం పార్లమెంట్ లైబ్రరీ భవనంలో ఎన్డీయే పార్లమెంటరీ పార్టీ 'మంగళ్ మిలన్' సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఈ సందర్భంగా ప్రభుత్వ నిర్ణయాలకు సంపూర్ణ మద్దతు తెలుపుతూ సభా కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొనాలని కూటమి ఎంపీలకు ప్రధాని మోదీ సూచించారు. సమావేశంలో ప్రధానంగా లోక్‌సభలో ప్రవేశపెట్టిన 'పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (సవరణ) బిల్లు-2026' ఆమోదంపై వ్యూహాన్ని ఖరారు చేశారు. పేపర్ లీక్‌లు, మాల్‌ప్రాక్టీస్‌లను అరికట్టేందుకు ఈ బిల్లులో కఠిన నిబంధనలు ప్రతిపాదించారు. నేరస్థులకు గరిష్ఠంగా 10 ఏళ్ల జైలు శిక్ష, రూ.10 కోట్ల జరిమానా విధించడంతో పాటు, కేసుల వేగవంతమైన విచారణ కోసం ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేయాలని బిల్లులో ప్రతిపాదించినట్లు సమావేశంలో చర్చించారు. ఇక భారత్ కుదుర్చుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల వల్ల కలుగుతున్న ప్రయోజనాలను కూటమి ఎంపీలకు కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ వివరించారు. భారత ఎగుమతుల పెరుగుదల, పెట్టుబడుల ఆకర్షణ, ఉపాధి అవకాశాల విస్తరణలో ఈ ఒప్పందాలు కీలకంగా మారాయని ఆయన పేర్కొన్నారు. మత్స్యశాఖకు సంబంధించిన ప్రభుత్వ పథకాలు, భవిష్యత్ కార్యాచరణపై కేంద్ర మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ వివరించారు. మత్స్యకారుల ఆదాయం పెంపు, మౌలిక సదుపాయాల అభివృద్ధి, ఎగుమతుల ప్రోత్సాహానికి ప్రభుత్వం చేపడుతున్న చర్యలను ఆయన ఎంపీలకు వివరించారు. మరోవైపు, జులై 20న ఢిల్లీలో విద్యార్థుల నిరసనపై పోలీసు చర్యను ప్రశ్నిస్తూ సభను అడ్డుకుంటున్న విపక్షాలకు తగిన రీతిలో సమాధానం ఇవ్వాలని ఎన్డీయే నిర్ణయించింది. ఈ సమావేశంలో కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, కిరణ్ రిజిజు, పీయూష్ గోయల్, రాజీవ్ రంజన్ సింగ్‌తో పాటు ఎన్డీయే భాగస్వామ్య పక్షాల ఎంపీలు పాల్గొన్నారు.

# హైడ్రా కార్యక్రమాలను కొనసాగిస్తాం..

కోర్టును తప్పుదోవ పట్టించారంటూ బీఆర్ఎస్ నేతలపై మండిపడ్డారు. కోర్టు తీర్పుని పరిశీలించి.. ఆ తర్వాత తదుపరి కార్యాచరణ రూపొందిస్తామని పేర్కొన్నారు. హైడ్రా కార్యాచరణ పైన తమకు పూర్తి స్పష్టత ఉందని అన్నారు. కబ్జాకోరులకు సహకరించొద్దంటూ మీడియాకు సూచించారు. డబ్బులు పెట్టి సోషల్ మీడియాలో హైడ్రాపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. లోతుకుంట భూముల కేసు విచారణ నేపథ్యంలో హైడ్రా కమిషనర్ ఎ.వి.రంగనాథ్‌పై తెలంగాణ హైకోర్టు సోమవారం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. హైడ్రా కమిషనర్ పదవి నుంచి రంగనాథ్‌ను తొలగించాని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించింది. సెక్రటరీ ర్యాంక్ స్థానంలో ఉన్న ఉన్నతాధికారి.. కోర్టు ఉత్తర్వులను ధిక్కరించడం ఏ మాత్రం సమంజసం కాదని ఈ సందర్భంగా తెలంగాణ హైకోర్టు ధర్మాసనం వ్యాఖ్యానించింది. అర్హత కలిగిన అధికారిని హైడ్రా కమిషనర్‌గా నియమించాలని ఈ సందర్భంగా ప్రభుత్వానికి సూచించింది. హైడ్రా కమిషనర్‌గా రంగనాథ్ కొనసాగితే రూల్ ఆఫ్ లా తప్పుతుందని అభిప్రాయపడింది. ఆయన్ని తొలగించడం మినహా మరో ప్రత్యామ్నాయం లేదని తెలంగాణ హైకోర్టు పేర్కొంది. ఈ నేపథ్యంలో ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ పైవిధంగా స్పందించారు.ఉన్నత న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాలపై సమీక్షిస్తామని చెప్పారు. కబ్జాకోరులు ఫేక్ పత్రాలతో కోర్టులను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. చెరువులు, కుంటలు, నాలాలను కాపాడటమే హైడ్రా సిబ్బంది విధి. బతుకమ్మకుంటను కబ్జా చేస్తే రక్షించారు.. దానిపై కోర్టుకెళ్లారు. బతుకమ్మకుంటలో బీఆర్ఎస్ నేత 10 ఎకరాలు కబ్జా చేశాడు. కేసీఆర్ పర్యటన సందర్భంగా ఆ నేత పూల వర్షం కురిపించాడు. కబ్జాదారులను కాపాడేందుకు డబ్బు ఖర్చు చేసి సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేయిస్తున్నారు. హైడ్రాపై ప్రభుత్వానికి స్పష్టత ఉంది. ఒక అధికారిని ఎక్కడ నియమించాలనే విచక్షణాధికారం ప్రభుత్వానికి ఉంటుంది. తప్పుడు కేసులను న్యాయస్థానాల్లో ఎదుర్కొంటాం' అని రేవంత్‌రెడ్డి అన్నారు.

# పరీక్షల సంస్కరణల బిల్లుకు మద్దతు ఇస్తాం

న్యూఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కొత్త బిల్లులు తీసుకురావడానికి ముందు గత తప్పుల నుంచి ఏమి నేర్చుకుందో ప్రజలకు చెప్పాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. ఎన్డీయే ప్రభుత్వ హయాంలో ఐదుసార్లు పేపర్ లీక్‌లు జరిగాయని.. అందులో ధర్మేంద్ర ప్రధాన్ విద్యాశాఖ మంత్రిగా మూడుసార్లు జరిగాయని వివరించారు. ప్రస్తుతం దేశానికి జవాబుదారీతనం, పారదర్శకత , దీర్ఘకాలిక సంస్కరణలు అవసరమని పేర్కొన్నారు. డా. కె. రాధాకృష్ణన్ కమిటీ సిఫార్సుల అమలు ఏమైందో చెప్పాలని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అలాగే నందన్ నీలేకని కమిటీ ఏర్పాటును స్వాగతిస్తున్నామని చెప్పుకొచ్చారు. మహిళా రిజర్వేషన్ బిల్లు ఇప్పటికే పార్లమెంట్ ఆమోదించింది.. అయితే దానిని డీలిమిటేషన్‌తో ముడిపెట్టి రాజకీయ గందరగోళం సృష్టించారని విమర్శించారు. డీలిమిటేషన్‌పై ఇప్పటివరకు ప్రభుత్వం ప్రత్యేక బిల్లు తీసుకు రాలేదని వివరించారు. అందుకు ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టం ఉదాహరణ అని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం-2014 ప్రకారం ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో లోక్‌సభ స్థానాలు పెంచాలని చట్టంలో ఉన్నప్పటికీ, 12 ఏళ్లుగా అవి అమలు కాలేదన్నారు. పార్లమెంట్ ఆమోదించిన చట్టాన్నే అమలు చేయని ప్రభుత్వం.. కొత్త హామీలను ప్రజలు ఎలా నమ్ముతారని సందేహం వ్యక్తం చేశారు. రాజ్యాంగం ప్రకారం ప్రతి జనాభా లెక్కల తర్వాత లోక్‌సభ స్థానాల పునర్విభజన జరగాల్సి ఉంటుందని పేర్కొన్నారు. 1971 జనాభా లెక్కల తర్వాత డీలిమిటేషన్‌ను నిలిపివేసి, ఆ తర్వాత వాజ్‌పేయి ప్రభుత్వం కూడా ఆ గడువును పొడిగించిందని వివరించారు. ఈ కాలంలో దక్షిణ భారత రాష్ట్రాలు కుటుంబ నియంత్రణను సమర్థవంతంగా అమలు చేశాయని.. కానీ ఉత్తర భారతంలోని రాష్ట్రాల్లో జనాభా అధికంగా పెరిగిందని సోదాహరణగా తెలిపారు. డీలిమిటేషన్ వల్ల దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరగకుండా స్పష్టత ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఈసందర్భంగా కేటీఆర్ డిమాండ్ చేశారు. నిన్న హైకోర్టు హైడ్రా అనేది 9 తలల విష సర్పం అని చెప్పింది. ముఖ్యమంత్రి ఇంతకంటే చెంపపెట్టు ముఖ్యమంత్రికి ఏముంటుంది.. సిగ్గుండాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. కేటీఆర్ ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్‌ను కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని రైల్వే ప్రాజెక్టులతోపాటు పలు ఐటీ సంస్థల అంశాలను కేంద్రమంత్రితో చర్చించారు. అనంతరం ఎంపీలు వద్దిరాజు రవిచంద్ర, దీవకొండ దామోదర్ రావుతో కలిసి ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ.. బడాబాబులను మాత్రం వదిలిపెట్టి గరీబోళ్ల ఇండ్ల మీద పడి.. రాష్ట్ర రెవెన్యూ మంత్రి ఇల్లు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చెరువులో ఉంటది. దాన్ని హైడ్రా ముట్టదు. రాష్ట్ర ముఖ్యమంత్రి సోదరుడి ఇల్లు ఎఫ్‌టీఎల్‌లో ఉంటది. దాన్ని హైడ్రా ముట్టదు. రాష్ట్ర మంత్రులు వివేక్, శాసనమండలి చైర్మన్ గుత్తు సుఖేందర్ రెడ్డి, రాష్ట్రంలో ఇంకా కీలక నేతలు చాలా మంది బిల్డింగులన్నీ చెరువుల్లో, శిఖాల్లో ఉన్న వాటిని మాత్రం హైడ్రా ముట్టదని కేటీఆర్ అన్నారు. కబ్జాకోరులని ముఖ్యమంత్రి అంటున్నరు. అందరికంటే పెద్ద కబ్జాకోరులే మీ అన్నదమ్ములు కదా.. అందరికంటే ఎక్కువ ఆస్తి దోస్తున్నది.. అందరికంటే ఎక్కువ విధ్వంసం చేస్తున్నది మీ మంత్రులు కదా..? కోటి ఎకరాలు నిషేధిత జాబితాలో పెట్టింది నీ మంత్రులు కాదా..? అని కేటీఆర్ ప్రశ్నించారు. కేసీఆర్ ప్రభుత్వం దిగిపోయిన నాడు రాష్ట్రంలో నిషేధిత భూముల ఎంతంటే మొత్తం 16 లక్షల ఎకరాలు.. ఇవాళ అది కోటి ఎకరాలకు చేరుకుంది. ఏ కారణం చేత కోటి ఎకరాలు పెడుతున్నరు. 30 శాతం కమిషన్ తీసుకోవడం లేదా..? మీ మంత్రులు.. అని ప్రశ్నించారు.

# స్వల్పంగా తగ్గిన బంగారం ధరలు

న్యూఢిల్లీ,జూలై28 అంతర్జాతీయ, భౌగోళిక, రాజకీయ కారణాల నేపథ్యంలో బంగారం ధరలు తగ్గుముఖం పట్టాయి. మంగళవారం పసిడి ధరలు భారీ తగ్గుదల నమోదు చేశాయి. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, మంగళవారం ఉదయం 10.00 గంటల సమయంలో హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,44,170గా ఉంది. నిన్నటితో పోల్చుకుంటే పది గ్రాములకు రూ.1690 మేర తగ్గింది.. ఇక, 22 క్యారెట్ల 10 గ్రాముల ఆర్నమెంటల్ బంగారం ధర రూ.1,32,150గా ఉంది. నిన్నటితో పోల్చుకుంటే పది గ్రాములకు రూ.1550 మేర తగ్గింది. మరోవైపు వెండి ధరలు కూడా తగ్గుదలను నమోదు చేశాయి. కిలోకు ఐదు వేల రూపాయల మేర తగ్గాయి. ప్రస్తుతం హైదరాబాద్, విజయవాడల్లో కిలో వెండి ధర రూ.2,35,000గా ఉంది.

# నీట్ అరెస్ట్‌లపై సుప్రీం కీలక ఆదేశాలు

తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ ఘటనలకు సంబంధించిన పిటిషన్లపై విచారణ సందర్భంగా, అత్యున్నత న్యాయస్థానం పోలీసుల తీరును తప్పుబట్టింది. శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును రాజ్యాంగం కల్పించిందని గుర్తుచేసింది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం ఈ కీలక వ్యాఖ్యలు చేసింది. 'నిర్దోషులపై అతిక్రమణలు, దౌర్జన్యాలకు పాల్పడిన వారు ఎంతటి వారైనా చట్టం ఊరుకోదు, తన పని తాను చేసుకుపోతుంది' అని ధర్మాసనం హెచ్చరించింది. ఈ ఘటనలపై 'స్వతంత్ర విచారణ' జరగాల్సిన అవసరం ఉందని కోర్టు అభిప్రాయపడింది. 'బాధ్యులను తేల్చనప్పుడు, విచారణకు అర్థమే లేదు' అని వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్యంలో శాంతియుత నిరసనలు తెలుపడం పౌరుల ప్రాథమిక హక్కు అని అత్యున్నత కోర్టు స్పష్టం చేసింది. నీట్ పరీక్షలో అక్రమాలపై న్యాయం కోరుతూ విద్యార్థులు ఆందోళనలు చేస్తున్న తరుణంలో, వారిపై బలాన్ని ప్రయోగించడం సరికాదని కోర్టు భావించింది. ఈ ఆందోళనల సమయంలో విద్యార్థులపై జరిగిన దాడి మాత్రమే కాకుండా, గాయపడిన పోలీసుల రక్షణ, వారి భద్రతా పరికరాల గురించి కూడా ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తామని కోర్టు పేర్కొంది. శాంతిభద్రతల నిర్వహణ అనేది ద్వితీయ ప్రాధాన్యం కాకూడదని స్పష్టం చేసింది. దేశవ్యాప్తంగా వివిధ సందర్భాల్లో జరుగుతున్న నిరసనల సమయంలో శాంతిభద్రతల నిర్వహణకు, అల్లర్లను అదుపు చేయడానికి సంబంధించి ఒకే విధమైన ప్రొటోకాల్ అవసరమని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. వేర్వేరు ప్రాంతాల్లో పోలీసులు వేర్వేరుగా ప్రవర్తించడం సరికాదని, నిర్దిష్ట నియమావళి ఉండాలని సూచించింది.

# ప్రశ్నపత్రాల లీకేజీలకు కారకులను కఠినంగా శిక్షించాలి

చెలాయించాలనే ప్రయత్నాన్ని కేంద్ర ప్రభుత్వం మానుకోవాలని సీఎం సూచించారు. విద్యను వీలైనంతవరకు రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోనే ఉంచితే తప్పిదాలకు అవకాశం తక్కువగా ఉంటుందని, ఈ అంశంపై పార్లమెంట్ చర్చ జరగాల్సి ఉందన్నారు. సభలో చర్చ జరిగితే రాహుల్ గాంధీ అన్ని అంశాలపైమాట్లాడతారని సీఎం తెలిపారు. ప్రశ్నా పత్రాలలీకేజీల నివారణకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం చేసే చట్టాన్ని చూసి తర్వాత రాష్ట్రంలో ఏం చేయాలనేదిచూస్తామని సీఎం ఒక ప్రశ్నకుబదులిచ్చారు. యూపీఎస్సీ విధానంలో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను ప్రక్షాళన చేసి నియామకాలు చేపట్టడంతోనే తాము పారదర్శకంగా పరీక్షలను నిర్వహించామని సీఎం తెలిపారు. విద్యార్థులకు నష్టం వాటిల్లకుండా, వారికి నమ్మకం, విశ్వాసం కలిగించేలా పారదర్శకంగా పరీక్షలు నిర్వహిస్తున్నట్లు సీఎం చెప్పారు. గ్లోబరీనావటి సంస్థలు నాడు అక్రమాలకు పాల్పడినా గత ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడంతో వాళ్లు సీబీఎస్‌ఈ పరీక్షలవరకు విస్తరించి, వాటిని గందరగోళంచేశారని సీఎం విమర్శించారు. ఇలాంటి సంస్థల పట్ల కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని సీఎం తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లు, ఉపాధి పనులవిషయంలో సమస్యలను కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ దృష్టికి తీసుకెళ్లామని, వాటి పరిష్కారానికి కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. తెలంగాణలోపరిస్థితుల పరి శీలనకు క్షేత్రస్థాయి పర్యటనకు రావాలని కేంద్ర మంత్రిని ఆహ్వానించినట్లు సీఎం తెలిపారు. ఫీజురీయింబర్స్‌మెంట్ కు సంబంధించి కేసీఆర్ ప్రభుత్వం రూ.8వేల కోట్లను బకాయిలను పెట్టి పోయిందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఎలాంటి వసతులు లేకుండా, దొంగ లెక్కలు చూపించి ఫీజు రీయింబర్స్‌మెంట్ కొట్టేయాలనుకునే సంస్థలమీద విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణ సాగుతోందని సీఎం తెలిపారు. సక్రమంగా ఉన్న వాళ్లకు బకాయిలుచెల్లిస్తామని ఓ ప్రశ్నకు సీఎం బదులిచ్చారు. కేసీఆర్ పెట్టిన బకాయిలే తమకు భారంగా మారాయన్నారు. తాము ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వడం లేదన్నట్లుగా, మా ప్రభుత్వం కారణమన్నట్లుగా బీఆర్ఎస్ భ్రమలు కల్పించే ప్రయత్నం చేస్తోందని, దానికి బీజేపీవంతపాడుతోందని సీఎం మండిపడ్డారు. ఆంధ్రప్రదేశ్‌లో ఫీజు బకాయిలపై బీజేపీ ఎంపీ ఆర్.కృష్ణయ్య ఎందుకు మాట్లాడడం లేదని సీఎం ప్రశ్నించారు. కూటమిప్రభుత్వం ఉన్న ఏపీలో 100 శాతం ఫీజు రీయింబర్స్‌మెంట్ చేయించిన తర్వాత తెలంగాణలో డిమాండ్ చేస్తే బాగుంటుందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, రామచందర్‌రావు, ఆర్.కృష్ణయ్యలకు సూచిస్తున్ ట్లు సీఎం తెలిపారు. గత ప్రభుత్వం బకాయిలే తమకు భారంగా మారాయని, అయినా అన్ని సమస్యలు పరిష్కరించే ప్రయత్నం చేస్తున్నామని సీఎం అన్నారు. భవిష్యత్తులో ఏ సంవత్సరానికి సంబంధించిన ఫీజుల మొత్తం అదే సంవత్సరంలో పూర్తిగా చెల్లిస్తామని, అడ్వాన్స్‌డ్‌గా బ్యాంక్ ఖాతాల్లో వేస్తామని సీఎం తెలిపారు. రాష్ట్రంలో ప్రతి సంవత్సరం రూ.2,200 నుంచి రూ.2,400 కోట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్‌కుఅవసరమవుతాయని సీఎం అన్నారు. క్రమంతప్పకుండా వాటిని చెల్లించేందుకు తమప్రభుత్వం ప్రణాళికలు రచించుకుందని, భవిష్యత్తులో ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్య రాష్ట్రంలో ఉండదని సీఎం స్పష్టం చేశారు.

# బిఆర్ఎస్ పాలనపై కవిత క్షమాపణలు స్వాగతిస్తున్నాం

చెబుతున్నారని తెలిపారు. హైడ్రాకు మద్దతుగా ప్రజలు ర్యాలీ తీస్తున్నారని చెప్పారు. అయితే హైడ్రా విషయంలో హైకోర్టు తీర్పును గౌరవిస్తామని స్పష్టం చేశారు. తాము చెప్పాల్సింది కోర్టుకు చెబుతామని అన్నారు. రాజకీయం కోసమే హైడ్రాకు వ్యతిరేకమైన పిటిషన్లు వేస్తున్నారని ఆరోపించారు. హైడ్రాకి వ్యతిరేకంగా బీజేపీ, బీఆర్ఎస్ కలిసి కుట్రలు చేస్తున్నాయని విమర్శించారు. కోర్టు పూర్తి తీర్పు ఇంకా రాలేదని గుర్తు చేశారు. మీడియాలో, సోషల్ మీడియాలో తప్పుడు సమాచారాన్ని తీసుకెళ్తోందంటూ బీఆర్ఎస్ పార్టీపై మంత్రి శ్రీధర్ బాబు నిప్పులు చెరిగారు.

# నగరంలో భారీ వర్షం

- లోతట్టు ప్రాంతాలు పూర్తిగా జలమయం
- ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం

హైదరాబాద్,జూలై28గ్రేటర్ హైదరాబాద్‌లో మంగళవారం సాయంత్రం వర్షం దంచికొట్టింది. ఆఫీసుల నుంచి ఇళ్లకు వెళ్లే సమయంలో వర్షం కురవడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. హైడ్రా, డీఆర్ఎఫ్, జీహెచ్ఎంసీ మాన్సూన్ బృందాలు సహాయక చర్యలు చేపట్టాయి. కుండపోత వర్షానికి నగరంలోని ప్రధాన రహదారులన్నీ జలమయమయ్యాయి. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, ఫిల్మ్‌నగర్, ఖైరతాబాద్, లక్డీకాపూల్, నాంపల్లి, కోఠి, మలక్‌పేట్, దిల్‌సుఖ్‌నగర్, చైతన్యపురి, కొత్తపేట, ఎల్‌బీ నగర్, వనస్థలిపురం, హయత్‌నగర్ ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. అదే సమయంలో బేగంపేట్, సికింద్రాబాద్, మణికొండ, గచ్చిబౌలి, మాదాపూర్, హైటెక్ సిటీ, కొంపల్లి, ఓల్డ్ సిటీ, అంబర్‌పేట్, కాచిగూడ ప్రాంతాల్లోనూ కుండపోత వర్షం పడటంతో రహదారులపై భారీగా నీరు నిలిచింది. పలుచోట్ల వాహనాలు ట్రాఫిక్ తీవ్రంగా స్తంభించి, ఉద్యోగులు, ప్రయాణికులు గంటల తరబడి ఇబ్బందులు ఎదుర్కొన్నారు.భారీ వర్షంతో పాటు ఈదురు గాలులు వీచడంతో నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. చెట్ల కొమ్మలు విరిగి రోడ్లపై పడటంతో రాకపోకలకు ఆటంకం కలిగింది. పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని హైడ్రా, డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్, జీహెచ్ఎంసీ మాన్సూన్ ఎమ్జర్గ÷న్సీ బృందాలు వెంటనే రంగంలోకి దిగి సహాయక చర్యలు చేపట్టాయి. నీరు నిలిచిన ప్రాంతాల్లో డ్రైనేజీలను శుభ్రం చేస్తూ, ట్రాఫిక్‌ను నియంత్రించే చర్యలు చేపట్టారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించగా, వర్షం కొనసాగుతున్న నేపథ్యంలో అత్యవసరం అయితే తప్ప బయటకు రావొద్దని నగరవాసులకు విజ్ఞప్తి చేశారు.

# సమస్యల పరిష్కారం కోసం పోరుబాట

### జంతర్ మంతర్ వద్ద జర్నలిస్టుల ఆందోళన

న్యూఢిల్లీ,జూలై28 జర్నలిస్టుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ జర్నలిస్టులు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర కమిటీ అధ్వర్యంలో వివిధ జిల్లాల నుంచి వచ్చిన జర్నలిస్టులు ఢిల్లీ జంతర్ మంతర్‌లో ధర్నా నిర్వహించారు. ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య, ప్రధాన కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్ ధర్నాలో మాట్లాడారు. జర్నలిస్టుల రైల్వే రాయితీ పాస్‌లను పునరుద్ధరించాలని, పదవీ విరమణ చేసిన జర్నలిస్టులకు జాతీయ పెన్షన్ పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాలపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు నేపథ్యంలో కేంద్రం తగుచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# నీట్ నిరసన ఉద్యమకారులకు ఊరట

### కేసులు ఎత్తేసిన బీహార్, అస్సాం ప్రభుత్వాలు

న్యూఢిల్లీ,జూలై28 నీట్ యూజీ పరీక్షల వ్యవహారంలో ఆందోళనలు చేపట్టిన విద్యార్థులు, నిరసనకారులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి భారీ ఊరట లభించింది. నిరసనల సందర్భంగా విద్యార్థులపై నమోదైన అన్ని కేసులను ఉపసంహరించుకోవాలని అస్సాం, బిహార్ ప్రభుత్వాలు కీలక నిర్ణయం తీసుకున్నాయి. రాజస్థాన్ ప్రభుత్వం కూడా త్వరలోనే ఇదే బాటలో నడవనుందని సమాచారం.ఈ అంశంపై కాక్రోచ్ జనతా పార్టీ ప్రతినిధులతో చర్చించిన కేంద్ర ప్రభుత్వ ప్రతినిధులు స్పష్టమైన హామీ ఇచ్చారు. అస్సాం, బిహార్ తరహాలోనే రాజస్థాన్‌లోనూ విద్యార్థులపై నమోదైన ఎఫ్ఐఆర్‌లను ఉపసంహరించుకుంటామని తెలిపినట్లు సీజేపీ అధికార ప్రతినిధి సౌరవ్ దాస్ వెల్లడించారు. మరోవైపు విద్యార్థుల భవిష్యత్తు, విద్యా వ్యవస్థలో సంస్కరణలను దృష్టిలో ఉంచుకుని అస్సాం హోం శాఖ ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేసింది. జులై 26 సాయంత్రం 6 గంటల వరకు నమోదైన 5 కేసుల్లో అరెస్టైన 13 మందిని త్వరితగతిన సమీక్షించి విడుదల చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించింది. అంతేకాకుండా నిరసనల్లో పాల్గొన్న అభ్యర్థులు లేదా విద్యార్థులపై భవిష్యత్తులో ఎలాంటి చట్టపరమైన చర్యలు ఉండబోవని అస్సాం హోమ్ అండ్ పొలిటికల్ డిపార్ట్‌మెంట్ ప్రకటనలో స్పష్టం చేసింది. ప్రభుత్వాల ఈ నిర్ణయంతో వేలాది మంది విద్యార్థులు, వారి కుటుంబసభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# తెలంగాణను దోచుకున్న ఇద్దరూ ఢిల్లీలో మకాం

### రేవంత్, కెటిఆర్‌లపై నిజామాబాద్ ఎంపి అర్వింద్ సెటైర్లు



న్యూఢిల్లీ, జూలై 28 తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఢిల్లీ పర్యటనపై నిజామాబాద్ బిజెపి ఎంపీ ధర్మపురి అరవింద్ స్పందించారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణను దోచుకున్న ఇద్దరూ ఈరోజు ఢిల్లీలో ఉన్నారంటూ వ్యాఖ్యానించారు. కేటీఆర్, రేవంత్ రెడ్డి ఇద్దరూ తెలంగాణ విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేయడంలో విజయవంతమయ్యారని విమర్శించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించడంలో విఫలమవడం వల్ల, తెలంగాణలో ప్రతి సంవత్సరం దాదాపు 20 లక్షల మంది విద్యార్థులు తమ విద్యా భవిష్యత్తుపై అనిశ్చితిని ఎదుర్కొంటున్నారని తెలిపారు. పెరుగుతున్న ఆర్థిక భారం కారణంగా వందలాది కళాశాలలు కూడా మూసివేతకి సిద్ధంగా ఉన్నాయని ఎంపీ అన్నారు. కాంగ్రెస్‌కు ముందు, బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని నిర్వీర్యం చేసిందని మండిపడ్డారు. అవినీతిలో కూరుకుపోయిన కాళేశ్వరం, మిషన్ భగీరథ వంటి రుణభార ప్రాజెక్టులలో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజాధనాన్ని కుమ్మరించిందని వ్యాఖ్యానించారు. ఈ ప్రాజెక్టుల ద్వారా కే-కుటుంబం అపారమైన సంపదను కూడబెట్టిందని ఆరోపించారు. ఇప్పుడు జెన్ జెడ్‌కు మద్దతుగా రేవంత్ రెడ్డి, కేటీఆర్ ఇద్దరూ మొసలి కన్నీళ్లు కార్చుతున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో అత్యధిక నిరుద్యోగ రేటు ఉన్న రెండు రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటని ఎంపీ అన్నారు. దాదాపు 13 ఏళ్లుగా ఉద్యోగాల క్యాలెండర్‌ను నిలిపివేసినందుకు రేవంత్ రెడ్డి, కేటీఆర్‌కు అవార్డులు ఇవ్వాలంటూ సెటైర్ విసిరారు. తెలంగాణకు ఇప్పుడు ఆర్థిక క్రమశిక్షణ, స్వచ్ఛమైన పాలన ఉన్న ప్రభుత్వం కావాలన్నారు. అందుకే తెలంగాణ.. బీజేపీకి సిద్ధంగా ఉందని గట్టిగా నమ్ముతున్నట్లు ఎంపీ ధర్మపురి అరవింద్ పేర్కొన్నారు.

## ఇందిరమ్మ ఇల్లు నిర్మాణ పనులను పరిశీలించిన ఎంపీడీవో



**యాదాద్రి భువనగిరి జిల్లా ఆర్సి జూలై 28 తరంగాలు**
వలిగొండ మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎంపీడీవో జి. జలంధర్ రెడ్డి నర్సయ్యగూడెం గ్రామంలో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి హాజరు రిజిస్టర్‌తో పాటు గ్రామ పంచాయతీకి సంబంధించిన ఇతర రికార్డులను పరిశీలించారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించి, పెండింగ్‌లో ఉన్న నిర్మాణాలను ప్రాధాన్యత ఆధారంగా త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. దోమల ద్వారా వ్యాధులు వ్యాపించే అవకాశాలు అధికంగా ఉన్నందున గ్రామ పరిసరాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లడం, నిల్వ నీటిలో ఆయిల్ బాల్స్ వినియోగించడం, అలాగే ప్రజల్లో పరిశుభ్రతపై అవగాహన కల్పించే కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులకు ఆదేశించారు.అనంతరం ఉపాధి హామీ ఈజీఎస్ పనులను పరిశీలించి, కూలీలను అధిక సంఖ్యలో సమీకరించి అప్పగించిన పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు.ఎల్-నినో ప్రభావం కారణంగా భవిష్యత్తులో వర్షపాతం తగ్గే అవకాశం ఉన్నందున ప్రతి నీటి బొట్టును సంరక్షించే విధంగా నీటి సంరక్షణ పనులను అత్యంత ప్రాధాన్యతతో చేపట్టాలని, అలాగే ప్రతీ ఇంటికి ఒక ఇంకుడు గుంత తప్పకుండా ఉండాలి అని ప్రజలకు మరియు అధికారులకు సూచించారు.ఈ తనిఖీలో గ్రామ సర్పంచ్ పసాల జ్యోతి, గ్రామ పంచాయతీ కార్యదర్శి బి. సుజాత, గ్రామ పంచాయతీ సిబ్బంది మరియు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఖమ్మం లో లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా పర్యటన



**తరంగాలు ఖమ్మం జిల్లా బ్యూరో :** జమ్మూ, కాశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా నేడు ఖమ్మం జిల్లాలో పర్యటించనున్నారు.అందులో భాగంగా ఉదయం 11.30 గంటలకు హైదరాబాద్ నుంచి రోడ్డు మార్గంలో వచ్చి ఖమ్మం కార్పొరేషన్, మున్సిపల్ కార్పొరేషన్ ఆఫీస్ దగ్గర లో ఎన్ ఎస్ పి కాలనీలోని నూతన శివాలయంలో ప్రత్యేక పూజ కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం మధ్యాహ్నం 12.15 గంటలకు వెలుగుమట్లలోని కాన్ రాయ్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో జరిగే కార్యక్రమానికి హాజరవుతారు. తర్వాత మధ్యాహ్నం 3.20 గంటలకు ఖమ్మం రూరల్ మండలం, గొల్లగూడెం గ్రామం లోని నామ ముత్తయ్య వరమ్మల స్మృతి వనాన్ని సందర్శించి నివాళులర్పిస్తారు. సాయంత్రం 4 గంటలకు హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణమవుతారు.

## స్త్రీ నిధి రుణాల లావాదేవీలు పూర్తిగా డిజిటల్ పద్ధతిలోనే జరగాలి

- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. శ్రీజ
- నూరు శాతం రుణ రికవరీ లక్ష్యంగా సెర్ప్, మెప్మా, స్త్రీ నిధి సిబ్బంది పనిచేయాలి
- స్త్రీ నిధి కమిటీ సమావేశాన్ని నిర్వహించిన అదనపు కలెక్టర్



**తరంగాలు ఖమ్మం జిల్లా బ్యూరో :** మహిళా సంఘాల సభ్యులు ఆర్థికంగా అభివృద్ధి చెంది, తమ ఆదాయాన్ని పెంచుకునేలా సకాలంలో రుణాలను అందిస్తూ, నూరు శాతం రికవరీ సాధించేలా స్త్రీ నిధి, సెర్ప్, మెప్మా సిబ్బంది పూర్తి సమన్వయంతో పనిచేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన స్త్రీ నిధి కమిటీ సమీక్షా సమావేశంలో అదనపు కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, క్షేత్రస్థాయిలో సిబ్బంది మధ్య ఎలాంటి సమన్వయ లోపం లేకుండా పరస్పరం అందుబాటులో ఉంటూ మహిళా సంఘాలను బలోపేతం చేయాలని అన్నారు. రుణాల పంపిణీ, రికవరీ ప్రక్రియలో వెనుకబడిన సిబ్బంది పనితీరును అదనపు కలెక్టర్ సమీక్షించారు. క్షేత్రస్థాయి సమస్యలను అడిగి తెలుసుకుని, వాటిని త్వరితగతిన పరిష్కరించి నిర్దేశిత లక్ష్యాలను సాధించాలని ఆదేశించారు. వచ్చే నెల నాటికి రికవరీ శాతం ఖచ్చితంగా 60 శాతానికి చేరాలని, రాబోయే సమావేశంలో ప్రగతిని తానే స్వయంగా సమీక్షిస్తానని అన్నారు. 'మన స్త్రీ నిధి' యాప్ ద్వారానే రికవరీ స్త్రీ నిధి రుణ రికవరీ ప్రక్రియ మరింత పారదర్శకంగా,వేగంగా సాగడానికి నిధులు ఎక్కడా దుర్వినియోగం కాకుండా ఉండేందుకు రికవరీ మొత్తాన్ని పూర్తిగా 'మన స్త్రీ నిధి' యాప్ ద్వారానే సేకరించాలని ఆదేశించారు. యాప్‌పై ప్రతి ఎస్.హెచ్.జి మహిళకు పూర్తి అవగాహన కల్పించాలన్నారు.ఇందుకోసం పట్టణాలలో వార్డుల వారీగా, గ్రామాల్లో వీఓ ల వారీగా ప్రత్యేక సమావేశాలు నిర్వహించి, మహిళల మొబైల్స్‌లో యాప్ డౌన్‌లోడ్ చేయించి, రికవరీ చేసే విధానాన్ని డెమో పద్ధతిలో వివరంగా వివరించాలని సిబ్బందిని ఆదేశించారు.ఈ సమావేశంలో డీఆర్‌డీఓ శ్రీరామ్ మాట్లాడుతూ, గ్రామ సంఘాల్లో స్త్రీ నిధి రికవరీ నిధులను సొంతానికి వాడుకుంటూ దుర్వినియోగానికి పాల్పడిన వీఓఏ లపై చట్టపరమైన కఠిన క్రిమినల్ చర్యలు తీసుకోవడానికి రికార్డులను సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు.ఈ సమీక్షా సమావేశంలో మెప్మా పీడీ, స్త్రీ నిధి రీజనల్ మేనేజర్ జి. రవీందర్ నాయక్, మెప్మా డీఎంసీ,ఏడీఎంసీ, టీఎంసీ,ఐదు టీఎల్ఎఫ్ మెప్మా సిబ్బంది, 20 మండలాల ఏపీఎంలు,స్త్రీ నిధి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ మత్స్యగిరి లక్ష్మి నరసింహ స్వామి దేవాలయంలో నూతన పాలకవర్గం ప్రమాణస్వీకార మహోత్సవం



**యాదాద్రి భువనగిరి జిల్లా ఆర్ సి 28 తరంగాలు**
వలిగొండ మండల పరిధిలో శ్రీ మత్స్యగిరి లక్ష్మి నరసింహ స్వామి దేవాలయంలో నూతన పాలకవర్గం ప్రమాణస్వీకారం మహోత్సవం బుధవారం దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో నిర్వహిస్తున్నట్లు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి హాజరై నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారోత్సవం ఆలయ కార్యనిర్మాణాధికారి కొత్త వెంకటేశం తెలియజేశారు.

## ప్రభుత్వ ఆసుపత్రుల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలి

- డిప్యూటీ తహసిల్దార్ కు
- సిపిఎం వినతి పత్రం అందజేత



**యాదాద్రి భువనగిరి జిల్లా ఆర్ సి జూలై 28 తరంగాలు**
వలిగొండ మండల పరిధిలోని నాలుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మరియు పల్లె దవఖానాలలలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కారం చేయాలని సిపిఎం వలిగొండ మండల కమిటీ ఆధ్వర్యంలో తహసిల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసిల్దార్ కు వినతిపత్రం అందించడం జరిగింది.ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మద్దెల రాజయ్య మండల కార్యదర్శి సిర్పంగి స్వామి లు మాట్లాడుతూ మండల వ్యాప్తంగా నాలుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు వలిగొండ,వేములకొండ,వర్కట్ పల్లి,వేలువర్తి లతోపాటు రెడ్లరేపాక, పులిగిల్ల, అరూర్, గ్రామాల్లో పల్లె దవాఖానాలు ఉన్నాయని,వీటిలో అనేక సమస్యలతో వైద్యం కోసం వెళ్తున్న ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని,వెంటనే వీటిల్లో నెలకొన్న సమస్యలను పరిష్కారం చేయాలని,మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 30 పడకల ఆసుపత్రిగా 24 గంటల వైద్య సేవలను అందించాలన్నారు, వేములకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం చుట్టూ ప్రహరి గోడ పూర్తిగా ధ్వంసమై కొన్నిచోట్ల కూలిపోయిందని దీంతో ఆసుపత్రి సిబ్బందితోపాటు ఆసుపత్రికి వచ్చే రోగులు ఇబ్బందులు పడుతున్నారని వెంటనే నూతన ప్రహరీ గోడను నిర్మాణం చేయాలని డిమాండ్ చేశారు,వెల్వర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వేములకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుండి డిప్యూటేషన్ పై డాక్టర్ను నియమిస్తూ వారికి కనీసం గెజిటెడ్ హోదా కూడా లేకుండా 12 సంవత్సరాలుగా నిర్లక్ష్యం చేస్తున్నారని వెంటనే రెగ్యులర్ డాక్టర్ను నియమించి వెల్వర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి గెజిటెడ్ హోదాను కల్పించాలని, అదేవిధంగా వర్కట్పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిత్యం వందల మందికి వైద్య సౌకర్యాలను అందిస్తుందని కానీ అక్కడ ఒక్క మెడికల్ ఆఫీసర్ మాత్రమే ఉండటం జరుగుతుందని, రెండవ మెడికల్ ఆఫీసర్ ను వెంటనే నియమించాలన్నారు, పులిగిల్ల,రెడ్ల రేపాక గ్రామాల్లో ఉన్న పల్లె దవఖానాలకు కనీస సౌకర్యాలు లేవని నూతన భవనాలను నిర్మించాలని, మండల వ్యాప్తంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు మరియు పల్లె దవఖానాలలో అనేక ఖాళీ పోస్టులు ఉన్నాయని వెంటనే వాటన్నిటినీ భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి వర్గ సభ్యులు కూర శ్రీనివాస్,మండల కమిటీ సభ్యులు మొగిలిపాక గోపాల్,గాజుల ఆంజనేయులు,పట్టణ కార్యదర్శి గర్దాసు నరసింహ,నాయకులు కొండూరు సత్తయ్య, ఉంద్రాటి పాపయ్య, తదితరులు పాల్గొన్నారు.

## క్రషర్ మిల్లు ఏర్పాటును వెంటనే నిలిపివేయాలి

- పంచాయతీ కార్యదర్శి వినతి పత్రం అందజేసిన రైతులు

**యాదాద్రి భువనగిరి జిల్లా ఆర్సి జూలై 28 తరంగాలు** వలిగొండ మండల పరిధిలోని పహిల్వాన్ పూర్ గ్రామం రైతులు తమ ప్రాంతంలో ప్రతిపాదిత క్రషర్ మిల్లు ఏర్పాటును వెంటనే నిలిపివేయాలని రైతులు డిమాండ్ చేశారు.క్రషర్ మిల్లు ఏర్పాటుతో పర్యావరణ కాలుష్యం పెరిగి, వ్యవసాయ భూములు, పంటలు, భూగర్భ జలాలు దెబ్బతింటాయని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామ ప్రజల ఆరోగ్యంపై కూడా ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని పేర్కొన్నారు.ఈ సందర్భంగా అధికారులు వెంటనే జోక్యం చేసుకుని క్రషర్ మిల్లు అనుమతులను ఇవ్వకూడదని,రైతుల సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ కి ఎమ్మార్వో కి వలిగొండ మైనింగ్ డిపార్ట్మెంట్ అధికారికి సూచించారు మరియు గ్రామపంచాయతీ కార్యదర్శి అధికారి కి గ్రామ రైతులు వినతి పత్రాన్ని అందజేశారు.




## యువత సమస్యలపై డీవైఎఫ్ఐ పోరాటం కొనసాగుతుంది

- డీవైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనగంటి వెంకటేష్



**యాదాద్రి భువనగిరి, జూలై 28, తరంగాలు** : దేశంలో యువతీ యువకులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం డీవైఎఫ్ఐ నిరంతరం పోరాటాలు నిర్వహిస్తోందని డీవైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనగంటి వెంకటేష్ అన్నారు.వలిగొండ మండలంలోని పులిగిల్ల గ్రామంలో మంగళవారం భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా కోటి యాభై లక్షల మంది సభ్యులతో డీవైఎఫ్ఐ అతిపెద్ద యువజన సంఘంగా కొనసాగుతోందని తెలిపారు. విప్లవ వీరుడు భగత్‌సింగ్ స్ఫూర్తితో అందరికీ విద్య, ఉపాధి కల్పించాలని ఉద్యమిస్తున్నామని చెప్పారు.కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రతి ఏడాది రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చి 12 సంవత్సరాలు గడిచినా యువతకు తగిన ఉపాధి అవకాశాలు కల్పించలేదని విమర్శించారు. అలాగే మతోన్మాదాన్ని ప్రోత్సహిస్తూ విద్వేష రాజకీయాలు చేస్తోందని ఆరోపించారు.తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు పూర్తయినా ఎన్నికల సమయంలో ఇచ్చిన నిరుద్యోగ హామీలను అమలు చేయడంలో విఫలమైందన్నారు. అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని ప్రకటించినా ఇప్పటివరకు ఆ హామీ నెరవేరలేదని విమర్శించారు.బిస్వాల్ కమిటీ నివేదిక ప్రకారం రాష్ట్రంలో రెండు లక్షలకు పైగా ఖాళీలు ఉన్నప్పటికీ నియామకాలు చేపట్టడం లేదని ఆరోపించారు. ప్రభుత్వం ప్రకటించనున్న 7 వేల పోలీసు పోస్టులు సరిపోవని, కనీసం 20 వేల పోలీసు పోస్టులతో నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు.అదేవిధంగా గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-3, గ్రూప్-4, జూనియర్ లెక్చరర్లు, డిగ్రీ లెక్చరర్లు, డీఎస్సీతో పాటు అన్ని శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలకు వెంటనే నోటిఫికేషన్లు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రకటించిన జాబ్ క్యాలెండర్‌ను వెంటనే అమలు చేసి, పారదర్శకంగా నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు.యువత మతోన్మాదానికి వ్యతిరేకంగా, అవినీతి నిర్మూలన కోసం, అందరికీ విద్యా--ఉపాధి హక్కులు సాధించేందుకు డీవైఎఫ్ఐ నిర్వహించే పోరాటాల్లో భాగస్వాములు కావాలని యువతకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కవిడే సురేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు వేముల నాగరాజు, డీవైఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు వడ్డెమను మధు, వడ్డెమాను రవి, గ్రామ నాయకులు కరణ్, నరేష్, సతీష్, సందెల దుర్గాప్రసాద్, వేముల ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రస్తుత వాతావరణ పరిస్థితులతో ఆరుతడి పంటల వైపు రైతులు మళ్లాలి

- జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్




నల్గొండ ప్రతినిధి , జూలై 28, తరంగాలు : ప్రస్తుత వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ సూచించారు. మంగళవారం రాష్ట్ర వ్యవసాయ శాఖ నిర్వహించిన "రైతు నేస్తం" 100వ ఎపిసోడ్ కార్యక్రమంలో హైదరాబాద్ నుంచి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొనగా, జిల్లాలోని దోమలపల్లి రైతు వేదిక నుంచి జిల్లా కలెక్టర్ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అల్పపీడన పరిస్థితుల కారణంగా సెప్టెంబర్ నెలలో కూడా తగినంత వర్షపాతం నమోదయ్యే అవకాశం లేదన్నారు. కర్ణాటక, మహారాష్ట్ర రాష్ట్రాల్లో కూడా వర్షాభావం ఉండటంతో శ్రీశైలం ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండే అవకాశాలు తక్కువగా ఉన్నాయని తెలిపారు. దీని ప్రభావంతో నాగార్జునసాగర్, ఏఎంఆర్‌పీ వంటి ప్రాజెక్టులకు నీటి లభ్యత తగ్గే పరిస్థితి ఏర్పడవచ్చని పేర్కొన్నారు.ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు ఆరుతడి పంటలైన సజ్జలు, కొర్రలు, సామలు సాగు చేయాలని సూచించారు. ఇప్పటికే పత్తి, కంది సాగు చేసిన రైతులు అంతర పంటలు వేసుకోవచ్చని, అలాగే ఉద్యాన పంటలు, కూరగాయల సాగు కూడా లాభదాయకమని చెప్పారు. ప్రభుత్వం సబ్సిడీపై బిందు సేద్య పరికరాలు అందజేస్తోందని, ఆరుతడి పంటలకు మార్కెటింగ్ సదుపాయాలు కూడా కల్పిస్తోందని తెలిపారు.అంతకుముందు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ, "రైతు నేస్తం" కార్యక్రమం ద్వారా రైతులకు వాతావరణ పరిస్థితులు, సాగు పద్ధతులు, పంటల ఎంపిక, ఎరువుల వినియోగం, వ్యవసాయ యాంత్రీకరణ వంటి అంశాలపై నిరంతరం అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. రైతు వేదికలు వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు, రైతుల మధ్య సమన్వయ వేదికలుగా పనిచేస్తున్నాయని పేర్కొన్నారు.ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని రైతులు ఉద్యాన పంటలు, ఆరుతడి పంటల వైపు మళ్లాలని మంత్రి సూచించారు. సజ్జలు, సామలు, కొర్రలు వంటి పంటలు నెలరోజుల వరకు నీరు లేకున్నా పెరుగుతాయని, వీటిని అంతర పంటలుగా కూడా సాగు చేయవచ్చని అన్నారు. ఆయిల్ పామ్ సాగు రైతులకు స్థిరమైన ఆదాయం అందిస్తుందని, పురుగులు, కోతుల బెడద కూడా తక్కువగా ఉంటుందని తెలిపారు.కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి వినోద్ కుమార్, జిల్లా హార్టికల్చర్ డిప్యూటీ డైరెక్టర్ శేఖర్, హార్టికల్చర్ అధికారులు, రైతులు పాల్గొన్నారు.



## 31లోపు రేషన్ కార్డు ఈకేవైసీ పూర్తి చేసుకోవాలి

• మార్కెట్ కమిటీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య



వర్ధన్నపేట ప్రతినిధి, జులై 28,తరంగాలు : వర్ధన్నపేట మండల ప్రజలందరూ ఈ నెల 31వ తేదీలోపు రేషన్ కార్డుకు సంబంధించిన (ఈ-కేవైసీ) ప్రక్రియను తప్పనిసరిగా పూర్తి చేసుకోవాలని వర్ధన్నపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య విజ్ఞప్తి చేశారు.మంగళవారం వర్ధన్నపేట మండలంలోని కట్రియాల గ్రామంలో ఆయన తన కుటుంబ సభ్యులతో కలిసి స్థానిక చౌకధరల దుకాణానికి వెళ్లి రేషన్ డీలర్ వద్ద ఈకేవైసీ ప్రక్రియను పూర్తి చేయించుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రేషన్ కార్డులు కలిగిన ప్రతి కుటుంబం తమ గ్రామంలోని రేషన్ డీలర్‌ను సంప్రదించి, రేషన్ కార్డు మరియు ఆధార్ కార్డుతో పాటు కుటుంబ సభ్యులందరి బయోమెట్రిక్ ధ్రువీకరణ చేయించుకోవాలని సూచించారు. ఈ కేవైసీ విజయవంతంగా పూర్తయిన అనంతరం కుటుంబ సభ్యుల సంఖ్యకు అనుగుణంగా బియ్యం తదితర నిత్యావసర సరుకులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అందుతాయని తెలిపారు. అందువల్ల అర్హులైన ప్రతి కుటుంబం ఆలస్యం చేయకుండా ఈ నెల 31వ తేదీలోపు ఈ కేవైసీ పూర్తి చేసుకోవాలని ఆయన కోరారు.

## కార్యకర్తల కుటుంబాలకు ఎల్లవేళలా అండగా ఉంటాం: రావుల శ్రీనాథ్ రెడ్డి గణపారపు రమేష్

• బాధిత కుటుంబానికి కొండంత అండ.. ?22 వేల ఆర్థిక సాయం అందించిన కాట్రపల్లి బి ఆర్ఎస్ నాయకులు



**కేసముద్రం, మహబూబాబాద్ జిల్లా, ప్రతినిధి, జులై. 28, తరంగాలు:** కాట్రపల్లి గ్రామ బి అర్ ఎస్ పార్టీ కార్యకర్తలు పుల్ల శ్రీనివాస్, వెంకన్న ,తండ్రి పుల్ల సరవయ్య, మరణించిన విషయం లో దశ దిన కర్మ కార్యక్రమం లో భాగంగా కేసముద్రం మాజీ జడ్పీటీసీ రావుల శ్రీనాథ్ రెడ్డి , ఇంటికెన్నె మాజీ సర్పంచ్, ప్రస్తుత ఉపసర్పంచ్ గణపరపు రమేష్, ఇద్దరు కలిసి 100కేజీ ల బియ్యం ఇవ్వడం జరిగింది అలాగే కాట్రపల్లి గ్రామ పార్టీ తరుపున ఆర్థిక సహాయం 22000 రూపాయలు ఇవ్వడం జరిగింది వారి కుటుంబానికి ఎల్లవేళలా ఇలాగే సపోర్ట్ గా ఉంటామని భరోసా కల్పించడం జరిగింది ఇట్టి కార్యక్రమం లో మండల నాయకులు కొండపల్లి రాకేష్ రెడ్డి, మాజీ సర్పంచ్ జల్లే సైదమ్మ రవీందర్, గ్రామ పార్టీ అధ్యక్షులు బొంత వెంకన్న, గ్రామ పార్టీ ప్రధాన కార్యదర్శి నల్లగొప్పుల రాజేష్ గౌడ్ మాజీ ఉప సర్పంచ్ పుల్ల శ్రీనివాస్, వార్డ్ మెంబెర్స్ కొయ్యల లలిత వెంకన్న, జాటోత్ నరేష్,ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## కల్వల మోడల్ స్కూల్ హాస్టల్ ను సందర్శించిన మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి

•హాస్టల్ లో ఏ సమస్య ఉన్న తన దృష్టికి తీసుకురావాలని విద్యార్థులకు సూచించిన మార్కెట్ చైర్మన్..



**కేసముద్రం,మహబూబాబాద్ జిల్లా,ప్రతినిధి, జూలై., 28 తరంగాలు:**కేసముద్రం మండలం, కల్వల గ్రామంలోని మోడల్ స్కూల్ వసతి గృహాన్ని మంగళవారం కేసముద్రం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గంట సంజీవరెడ్డి సందర్శించి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా విద్యార్థులు విద్యుత్, నీటి సరఫరాకు సంబంధించిన సమస్యను మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి దృష్టికి తీసుకురాగా వెంటనే స్పందించిన మార్కెట్ చైర్మన్ సంబంధిత అధికారుల తో మాట్లాడి సమస్యను వెంటనే పరిష్కరించాలని తెలిపారు. వసతి గృహంలో విద్యార్థులకు ఎలాంటి సమస్య ఉన్న తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరించేం దుకు చర్యలు తీసుకుంటామని మార్కెట్ చైర్మన్ విద్యార్థులకు భరోసనిచ్చారు.విద్యార్థులు క్రమశిక్షణ, ప్రణాళిక బద్దంగా చదువి లక్ష్యాన్ని సాధించాలని మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నవీన్, పెదగాని రవి పాల్గొన్నారు.

# వరంగల్ అభివృద్ధి పనులపై గడ్కరీకి వినతులు

ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరి విజ్ఞప్తి



**న్యూఢిల్లీ, జులై 28,తరంగాలు** : వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న కీలక రహదారి అభివృద్ధి పనులకు ఆమోదం తెలపడంతో పాటు జాతీయ రహదారి--163పై అసంపూర్తిగా ఉన్న సర్వీస్ రోడ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని కోరుతూ వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మంగళవారం కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గాడ్కరి ని న్యూఢిల్లీలో కలిసి వినతిపత్రాలు సమర్పించారు.ఈ సందర్భంగా హనుమకొండ జిల్లాలోని కరుణాపురం--పెద్ద పెండ్యాల--నర్సింగరావుపల్లి--ఎలుకుర్తి--ధర్మసాగర్--దేవునూర్--సోమ దేవరపల్లి--దామెర--ఎల్కతుర్తి వరకు ఉన్న రహదారిని విస్తరించి బలోపేతం చేయాల్సిన అవసరాన్ని వివరించారు. ఈ మార్గం హైదరాబాద్--కరీంనగర్--సిద్ధిపేట ప్రాంతాల నుంచి వరంగల్‌కు వెళ్లకుండా జాతీయ రహదారులు 163, 563లను అనుసంధానించే కీలక మార్గమని, వేలాది మంది ప్రజలు, రైతులు, విద్యార్థులు, వ్యాపారులు నిత్యం వినియోగిస్తున్నందున అభివృద్ధి అత్యవసరమని తెలిపారు.

అలాగే యాదాద్రి--వరంగల్ జాతీయ రహదారి (ఎన్‌హెచ్--163) నాలుగు లైన్ల విస్తరణలో భాగంగా నిడిగొండ, రఘునాథపల్లి, చాగల్, ఘన్‌పూర్ స్టేషన్, చిన్నపెండ్యాల, కరుణాపురం గ్రామాల వద్ద అసంపూర్తిగా ఉన్న సర్వీస్ రోడ్ల లింకులను పూర్తి చేయాలని కోరారు. ప్రస్తుతం అనుసంధానం లేకపోవడంతో స్థానికులు ప్రధాన రహదారినే వినియోగించాల్సి వస్తోందని, దీంతో ట్రాఫిక్ సమస్యలు, ప్రమాదాల ముప్పు పెరుగుతున్నాయని వివరించారు. అవసరమైన భూమి ఇప్పటికే సేకరించినందున మిగిలిన పనులను వెంటనే ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు.అదేవిధంగా కేంద్ర రోడ్డు మరియు మౌలిక సదుపాయాల నిధి (సీఆర్ఐఎఫ్ ) 2025--26 కింద తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదించిన అదనపు రహదారి అభివృద్ధి పనులకు ఆమోదం తెలపాలని కోరారు. నర్సంపేట--నందిగామ రహదారి విస్తరణతో పాటు భట్టుపల్లి--హంటర్ రోడ్ అభివృద్ధి పనులు గ్రామీణ ప్రాంతాల అనుసంధానాన్ని మెరుగుపరచడంతో పాటు వ్యవసాయ, వాణిజ్య, పారిశ్రామిక రంగాల అభివృద్ధికి దోహదపడతాయని తెలిపారు.వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రజల దీర్ఘకాలిక అవసరాలకు సంబంధించిన ఈ ప్రతిపాదనలను సానుకూలంగా పరిశీలించి త్వరితగతిన ఆమోదించాలని ఎంపీ డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కోరగా, వినతులను సానుకూలంగా పరిశీలిస్తామని ఆయన హామీ ఇచ్చినట్లు తెలిపారు.

# ఊపిరితిత్తుల వ్యాధులకు శస్త్రచికిత్స అవసరం లేదు



• అత్యాధునిక ఇంటర్వెన్షనల్ పల్మనాలజీతో కోత లేకుండానే చికిత్స

• యశోదా ఆసుపత్రి వైద్యులు డాక్టర్ ప్రణయ్ సాయి చంద్రగిరి

**తరంగాలు ఖమ్మం జిల్లా బ్యూరో** : .ఊపిరితిత్తుల క్యాన్సర్,శ్వాసనాళాల అవరోధం, ఊపిరితిత్తుల్లో నీరు చేరడం, దీర్ఘకాలిక దగ్గు, రక్తంతో దగ్గు,తీవ్రమైన శ్వాసకోశ వ్యాధులు వంటి సమస్యల నిర్ధారణ, చికిత్స కోసం గతంలో చాలాసార్లు పెద్ద శస్త్రచికిత్సలు అవసరమయ్యేవని,ఇప్పుడు ఆధునిక వైద్య సాంకేతికత అభివృద్ధితో ఇంటర్వెన్షనల్ పల్మనాలజీ ద్వారా శరీరాన్ని పెద్దగా కోయకుండా, అత్యల్ప గాట్లతోనే అనేక క్లిష్టమైన ఊపిరితిత్తుల వ్యాధులను గుర్తించి సమర్థవంతంగా చికిత్స చేయడం సాధ్యమవుతోందని హైదరాబాద్ మలక్‌పేట్ యశోదా ఆసుపత్రి వైద్యులు, ఎం.డి(రెస్పిరేటరీ మెడిసిన్), డి.ఎం(పల్మనరీ, క్రిటికల్ కేర్ స్లీప్ మెడిసిన్) డాక్టర్ ప్రణయ్ సాయి చంద్రగిరి పేర్కొన్నారు. ఖమ్మంలోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. మలక్‌పేట్‌లోని యశోదా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్లో అత్యాధునిక ఇంటర్వెన్షనల్ పల్మనాలజీ సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఊపిరితిత్తుల క్యాన్సర్,శ్వాసనాళాల ఇరుకుదనం,పునరావృతమయ్యే ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్లు,ప్లూరల్ ఎఫ్యూషన్, ఎంపిసీమా వంటి క్లిష్టమైన శ్వాసకోశ వ్యాధులకు అత్యల్ప జోక్యంతో, తక్కువ నొప్పితో, వేగవంతమైన కోలుకునే విధంగా ఆధునిక చికిత్సలు అందిస్తున్నామని తెలిపారు. ఇంటర్వెన్షనల్ పల్మనాలజీ అంటే...ఇంటర్వెన్షనల్ పల్మనాలజీ అనేది శ్వాసకోశ వైద్యశాస్త్రంలో అత్యాధునిక సూపర్ స్పెషాలిటీ. ఇందులో ప్రత్యేక బ్రాంకోస్కోపీలు,అల్ట్రాసౌండ్ ఆధారిత సాంకేతికతలు,చిన్న రంధ్రాల ద్వారా చేసే చికిత్సా విధానాలను ఉపయోగించి ఊపిరితిత్తులు,శ్వాసనాళాలు, ఛాతీ లోపలి భాగంలోని అనేక క్లిష్టమైన వ్యాధులను నిర్ధారించి చికిత్స అందిస్తారు. సాంప్రదాయ శస్త్రచికిత్సలతో పోలిస్తే ఇవి అత్యల్ప జోక్యంతో పూర్తవుతాయి.ఫలితంగా రోగికి నొప్పి తక్కువగా ఉండటంతో పాటు త్వరగా కోలుకునే అవకాశం ఉంటుందని డాక్టర్ ప్రణయ్ సాయి తెలిపారు.

అందుబాటులో ఉన్న అత్యాధునిక సేవలు

యశోదా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్లో ఇంటర్వెన్షనల్ పల్మనాలజీ సేవలు అందుబాటులో ఉన్నాయి.ఎండోబ్రాంకియల్ అల్ట్రాసౌండ్ (ఉఖ్ఖి) ద్వారా ఊపిరితిత్తుల క్యాన్సర్ నిర్ధారణ, స్టేజింగ్,అడ్వాన్స్డ్ ఫ్లెక్సిబుల్, రిజిడ్ బ్రాంకోస్కోపీ, శ్వాసనాళాల్లో ఏర్పడిన కణితులు,అవరోధాల తొలగింపు,ఎయిర్వే స్టెంటింగ్,క్రయోథెరపీ, ఎలక్ట్రోకాటరీ ద్వారా శ్వాసనాళాల చికిత్స, ఊపిరితిత్తుల చుట్టూ పేరుకునే ద్రవం తొలగింపు (ప్లూరల్ ఇంటర్వెన్షన్స్), మెడికల్ థొరాకోస్కోపీ, ఎంపిసీమా రోగులకు బ్రాంకోస్కోపిక్ లంగ్ వాల్యూమ్ రిడక్షన్, ఇమేజ్ గైడెడ్ బయాప్సీలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

రోగులకు కలిగే ప్రయోజనాలు

ఈ ఆధునిక చికిత్సా విధానాల ద్వారా రోగులకు అనేక ప్రయోజనాలు లభిస్తున్నాయన్నారు. పెద్ద శస్త్రచికిత్స అవసరం తగ్గుతుంది, వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించే అవకాశం, నొప్పి తక్కువ,సంక్లిష్టతలు తగ్గుతాయి, ఆసుపత్రిలో ఉండే రోజులు తగ్గుతాయి,శ్వాసనాళాల అవరోధం, ఊపిరితిత్తుల్లో నీరు వంటి సమస్యలకు తక్షణ ఉపశమనం కలుగుతుంది. పెద్ద శస్త్రచికిత్స చేయించుకోలేని వృద్ధులు, ఇతర అనారోగ్య సమస్యలున్న రోగులకు కూడా సమర్థవంతమైన చికిత్స అందించవచ్చని తెలిపారు.

విప్లవాత్మక మార్పులకు నాంది...

'ఇంటర్వెన్షనల్ పల్మనాలజీ శ్వాసకోశ వైద్యంలో విప్లవాత్మక మార్పులకు నాంది పలికింది. గతంలో పెద్ద శస్త్రచికిత్స అవసరమైన అనేక ఊపిరితిత్తుల వ్యాధులను ఇప్పుడు అత్యాధునిక మినిమల్లీ ఇన్వేసివ్ విధానాలతో సురక్షితంగా నిర్ధారించి చికిత్స చేయగలుగుతున్నామన్నారు. ముఖ్యంగా ఎండోబ్రాంకియల్ అల్ట్రాసౌండ్, అడ్వాన్స్డ్ బ్రాంకోస్కోపీ, మెడికల్ థొరాకోస్కోపీ, ఎయిర్వే ఇంటర్వెన్షన్స్, ఇమేజ్ గైడెడ్ విధానాల ద్వారా వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించి,రోగికి తక్కువ నొప్పితో,తక్కువ రోజుల్లో కోలుకునేలా సమర్థవంతమైన చికిత్స అందించడం సాధ్యమవుతోందన్నారు.దీర్ఘకాలిక దగ్గు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది,రక్తంతో దగ్గు వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా ప్రారంభ దశలోనే పరీక్షలు చేయించుకోవడం వల్ల ప్రాణాంతక వ్యాధులను కూడా సకాలంలో గుర్తించి విజయవంతంగా చికిత్స చేయవచ్చని తెలిపారు.

ఇంటర్వెన్షనల్ పల్మనాలజీ ద్వారా చికిత్స

ఇంటర్వెన్షనల్ పల్మనాలజీ ద్వారా క్రింది సమస్యలకు సమర్థవంతమైన చికిత్స అందించవచ్చు.ఊపిరితిత్తుల క్యాన్సర్,దీర్ఘకాలిక దగ్గు,శ్వాసనాళాల అవరోధం,పదేపదే వచ్చే ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్లు, ఊపిరితిత్తుల చుట్టూ నీరు చేరడం,ఛాతీలో లింఫ్ గ్రంథుల వాపు, తీవ్రమైన ఎంపిసీమా, ఇతర క్లిష్టమైన శ్వాసకోశ వ్యాధులకు చికిత్స అందుతుందన్నారు.

దీర్ఘకాలిక దగ్గు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది,రక్తంతో దగ్గు, పదేపదే ఛాతీ ఇన్ఫెక్షన్లు, ఊపిరితిత్తుల్లో అనుమానాస్పద మార్పులు వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా ప్రారంభ దశలోనే నిపుణులను సంప్రదిస్తే అనేక ప్రాణాంతక వ్యాధులను సకాలంలో గుర్తించి సమర్థవంతంగా చికిత్స చేయవచ్చని మలక్పేట్ యశోదా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ యాజమాన్యం తెలిపింది.యశోదా హాస్పిటల్స్ డైరెక్టర్ గోరుకంటి పవన్, యూనిట్ హెడ్ కె. శ్రీనివాసరెడ్డి, అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ చిదుర మాట్లాడుతూ, అత్యాధునిక బ్రాంకోస్కోపీ సూట్లు,ఎండోబ్రాంకియల్ అల్ట్రాసౌండ్, మెడికల్ థొరాకోస్కోపీ, ఆధునిక ఇమేజింగ్ సదుపాయాలు, అనుభవజ్ఞులైన ఇంటర్వెన్షనల్ పల్మనాలజీ నిపుణులతో క్లిష్టమైన ఊపిరితిత్తుల వ్యాధులకు కూడా ప్రపంచ స్థాయి వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. అత్యాధునిక సాంకేతికత, శాస్త్రీయ చికిత్సా విధానాలు, బహుళ విభాగాల నిపుణుల సమన్వయంతో రోగులకు సురక్షితమైన, నాణ్యమైన వైద్య సేవలు అందించడం యశోదా ఆసుపత్రుల లక్ష్యమని వారు పేర్కొన్నారు.

THARANGALU DAILY NEWS
బుధవారం, 29 జూలై, 2026
జాతీయ దిన పత్రిక
తరంగాలు

# ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగి సంరక్షణకు అత్యున్నత ప్రాధాన్యత ఇవ్వాలి

- జిల్లా కలెక్టర్ దివాకర.టిఎస్
- ఓపీ నిర్వహణకు ప్రామాణిక విధానాలు తప్పనిసరిగా అమలు చేయాలి
- ఆసుపత్రి, మెడికల్ కళాశాల ఖాళీల భర్తీకి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలి
- ఆసుపత్రి నిర్వహణ, వైద్య సేవలపై సమీక్ష



**తరంగాలు ఖమ్మం జిల్లా బ్యూరో :** ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగి సంరక్షణ (పేషెంట్ కేర్)కు అత్యున్నత ప్రాధాన్యత ఇవ్వాలని, ఆసుపత్రి నిర్వహణలో సమస్యలు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారాలు రూపొందించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులను ఆదేశించారు.ఖమ్మం ప్రభుత్వ జిల్లా ఆసుపత్రి సమావేశ మందిరంలో వైద్య అధికారులతో ఆసుపత్రి నిర్వహణ, ఎదురవుతున్న సమస్యలు, వైద్య సేవల నాణ్యత, పేషెంట్ కేర్ అంశాలపై జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ పారస్ కుమార్ లతో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఓపీ నిర్వహణకు అవసరమైన ప్రామాణిక విధానాలు (ఎస్ఓపీ) తప్పని సరిగా అమలు చేయాలని ఆదేశించారు. రోగుల అవసరాలకు అనుగుణంగా మందులు, ఇతర వైద్య సామగ్రిని నిరంతరం అందుబాటులో ఉంచాలని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న రోగులకు ఏ మందునూ ప్రైవేటుగా కొనుగోలు చేయాలని సూచించకూడదని స్పష్టం చేశారు. ఆసుపత్రిలో రోగి సంరక్షణకు అత్యున్నత ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రస్తుతం ఉన్న సమస్యలను మళ్లీ తలెత్తకుండా శాశ్వతంగా పరిష్కరించాలని సూచించారు. పార్కింగ్, సీసీ కెమెరాల ఏర్పాటు, ఇతర మౌళిక సదుపాయాల కల్పన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మెడికల్ కళాశాలలో ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్ల ఖాళీలపై ప్రత్యేక నివేదిక సమర్పించాలని సూచించారు. ప్రభుత్వ అనుమతి లభించిన పోస్టులను ఔట్‌సోర్సింగ్ ద్వారా వెంటనే భర్తీ చేయాలని, దరఖాస్తులు రాకపోతే వైద్యులు తమ వృత్తిపరమైన పరిచయాలు, స్నేహితుల వర్గం, నెట్‌వర్క్‌ను వినియోగించి అర్హులైన అభ్యర్థులను తీసుకువచ్చి పోస్టులు భర్తీ అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వం అనుమతి ఇచ్చిన పోస్టులు భర్తీ కాకపోవడం మన వైఫల్యంగా పరిగణించాల్సి ఉంటుందని అన్నారు. వైద్యులు కేవలం వైద్య సేవలకే పరిమితం కాకుండా సమర్థవంతమైన పరిపాలకులుగా కూడా వ్యవహరించాలని, సమస్యలను గుర్తించడమే కాకుండా పరిష్కారాలను సృష్టించే దిశగా పనిచేయాలని సూచించారు. తన గత సేవాకాలంలో వైద్యులు తమ నెట్‌వర్క్ ద్వారా హనుమకొండ నుంచి ములుగు వరకు వైద్యులను తీసుకువచ్చి సేవలు అందించిన అనుభవాన్ని వివరించారు.ఆసుపత్రి, మెడికల్ కళాశాలలో మొత్తం ఎన్ని ఖాళీలు ఉన్నాయో, వాటిలో ఎన్ని పోస్టులకు ఔట్‌సోర్సింగ్ ద్వారా భర్తీ చేసేందుకు అనుమతి లభించిందో, ఎన్ని పోస్టులకు అనుమతి లేదో, అనుమతి ఉన్నప్పటికీ ఎందుకు భర్తీ కాలేదో పూర్తి వివరాలతో నివేదిక సిద్ధం చేయాలని ఆదేశించారు. ఇదే నివేదికలో పారామెడికల్ సిబ్బంది ఖాళీల వివరాలను కూడా చేర్చి, అన్ని ఖాళీల భర్తీకి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక సమర్పించాలని సూచించారు.ఆసుపత్రి భద్రతను మరింత బలోపేతం చేసేందుకు 8 లక్షలతో మంజూరు చేసిన భద్రతా పనులను వెంటనే ప్రారంభించి త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. వైద్యులు, సిబ్బంది హాజరును బయోమెట్రిక్ విధానంలో నమోదు చేయాలని, ఆస్పత్రిలో మంజూరైన నిధులతో పూర్తి స్థాయిలో పనులు చేపట్టాలని సూచించారు.ఆసుపత్రిలోని ప్రతి వార్డు, ప్రతి గదిని పరిశీలించి పైకప్పుల లీకేజీలు సహా అవసరమైన మరమ్మతులను అంచనా వేసి, రోగి సంరక్షణకు ప్రాధాన్యతనిస్తూ చేపట్టాల్సిన సివిల్ పనుల ప్రతిపాదనలు అంచనాలతో సహా ఆగస్టు 10వ తేదీలోగా సమర్పించాలని అధికారులను ఆదేశించారు.ఆసుపత్రికి అవసరమైన వైద్య పరికరాలు, ఇతర సామగ్రి కొనుగోళ్ల కోసం సరఫరాదారుల ఎంపానెల్‌మెంట్‌ను పారదర్శకంగా నిర్వహించాలని,అవసరమైన వస్తువులు, ధరలు, ఎంపానెల్‌మెంట్‌కు సంబంధించిన పూర్తి రికార్డులు నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వ నిధులను అత్యంత బాధ్యతా యుతంగా,సమర్థవంతంగా వినియోగించాలని ఆదేశించారు. ఆసుపత్రి భద్రతా సిబ్బంది తమ విధులను సమర్థవంతంగా నిర్వహించాలని, అవసరమైతే పోలీసు శాఖ సహకారం తీసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు.అనంతరం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఆసుపత్రిలోని ఓపీ విభాగం, వార్డులు, ఐసీయూ, మాతా శిశు ఆరోగ్య కేంద్రంలోని విభాగాలను పరిశీలించి రోగులకు అందుతున్న వైద్య సేవలను తనిఖీ చేసి అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ సమావేశంలో ప్రధాన ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. నరేందర్, ప్రభుత్వ మెడికల్ కళాశాల పర్యవేక్షకులు డా.డా.రాజేశ్వర రావు, వైద్య శాఖ ఇఇ ఉమామహేశ్వర రావు, ఆసుపత్రి వివిధ విభాగాల వైద్యాధికారులు,వైద్యులు,సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# నషా ముక్త యువ ఫర్ వికసిత భారత్ ప్రారంభోత్సవం




**నల్గొండ, జూలై 28, తరంగాలు :** భారత ప్రభుత్వం యువజన వ్యవహారాలు మరియు క్రీడల మంత్రిత్వ శాఖ మై భారత్ నల్లగొండ వారి ఆధ్వర్యంలో స్థానిక నల్లగొండ పట్టణంలో ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల స్వ నల్లగొండలో ఈరోజు నషా ముక్త యావ ఫర్ వికసిత భారత్ ప్రారంభోత్సవ కార్యక్రమం చాలా ఘనంగా జరిగింది. జిల్లా యువజన అధికారి శ్రీ గౌతమ్ రెడ్డి ఆధ్వర్యంలో కళాశాలలోని నాలుగు ఎన్ఎస్ఎస్ యూనిట్లు ఈ కార్యక్రమాన్ని నిర్వహించాయి. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వచ్చిన జిల్లా అదనపు ఎస్పీ శ్రీ రమేష్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులు డ్రగ్స్ కు దూరంగా ఉండాలని సూచించడం జరిగింది. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ నల్లగొండ జిల్లా శాఖ అధ్యక్షుడు శ్రీ గోలి అమరేందర్ రెడ్డి మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ శ్రీమారం వెంకటరమణారెడ్డి కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కే శ్రీనివాస్ రాజు మరియు అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ల ప్రోగ్రామ్ ఆఫీసర్లు పి పుష్పలత డాక్టర్ ఏ వసంత చైతన్య సుధా ఆనంద్ మరియు వైస్ ప్రిన్సిపల్ కే మంజుల డాక్టర్ సాలయ్య డాక్టర్ మల్లేశ్వరి డాక్టర్ శ్రీనివాస్ డాక్టర్ అమరావతి ప్రొఫెసర్ జోత్స్న మరియుసీనియర్ లైబ్రేరియన్ డాక్టర్ ఎస్ రాజారామ్ ఇతర లెక్చరర్లు ఆఫీసు సిబ్బంది నషా ముక్త యువ ఫర్ వికసిత భారత్ ప్రధానాంశంగా వివిధ పోటీలు నిర్వహించారు మ్యూజిక్ పాటలు డాన్స్ స్లోగన్ మేకింగ్ పెయింటింగ్ షార్ట్ ఫిలిం మైమ్ మరియు నాటకాలు అంశాలలో పోటీలు నిర్వహించారు విజేతలకు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కే.శ్రీనివాసరాజు గారు, జిల్లా యువజన అధికారి శ్రీ గౌతమ్ రెడ్డి మరియు జిల్లా యువ యువత మరియు ఆటలు అక్బర్ అలీ గారు గారు మరియు ఇతర అతిథులు బహుమతులు ప్రధానం చేయడం జరిగింది.




## ఎన్ క్యూ ఐ సేవలు అభినందనీయం

- ఇండియా బిషప్ రమేష్ బాలన్



**తరంగాలు ఖమ్మం జిల్లా బ్యూరో :** స్పిరిట్ క్వెస్ట్ ఇంటర్నేషనల్ , ఎస్ క్యూ ఐ పెంతుకోస్టల్ డయాసిస్ చేసిన సేవలు అభినందనీయమని బిషప్ రమేష్ బాలన్ అన్నారు. మంగళవారం కారేపల్లి బీసీ కాలనీ బెతస్థా ప్రార్థన మందిరం పాస్టర్ విలియం కేరి,జాన్ ప్రకాష్ అధ్యక్షతన మండల పరిధిలో ఆసియా బిషప్ డాక్టర్ రమేష్ బాలన్ డిడి, ఇండియన్ ఫైవ్ స్టేట్ బిషప్ ప్రకాశం, దహించు అగ్ని కృపా ప్రార్థన మందిరం బిషప్ సతీష్ రెడ్డి, ఇండియా స్టాఫ్ పాస్టర్ ధన శేఖరన్, పాస్టర్ లలితా రెడ్డి, ఆధ్వర్యంలో మ్యారేజ్ లైసెన్సులు డిస్ట్రిబ్యూషన్, ఆర్డినేషన్ ఘనంగా జరిగింది. బిషప్ రమేష్ బాలన్ మాట్లాడుతూ... ఈ సంస్థ మారుమూల గ్రామాల్లో పరిచర్య చేస్తున్నటువంటి సేవకులను ప్రోత్సహించడం ముఖ్య ఉద్దేశం అన్నారు. సంస్థలో పనిచేస్తున్న పాస్టర్లకు సామాజిక, ఆరోగ్య భద్రతలను కల్పించినట్లు బిషప్ అన్నారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ ఆడం , మండల పాస్టర్లు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## కేసముద్రం రైతు వేదికలో 'రైతు నేస్తం' శతాభిషేకం సన్మానాలు

- రాయితీ విత్తనాల పంపిణీ



**కేసముద్రం,మహబూబాబాద్ జిల్లా, ప్రతినిధి,జులై.28, తరంగాలు**:మంగళవారం కేసముద్రం రైతు వేదిక యందు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ శాఖ మరియు ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ' ప్రతి మంగళవారం ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు నిర్వహించే "రైతు నేస్తం' కార్యక్రమం మంగళవారం తో (28 జూలై 2026) 100వ ఎపిసోడ్‌కు చేరుకున్న సందర్భంగా కేసముద్రం రైతు వేదిక యందు వీడియో కాన్ఫరెన్స్ యూనిట్ ద్వారా రైతు నేస్తం ప్రత్యక్ష ప్రసార కార్యక్రమం కు, వ్యవసాయ శాఖ అధికారులు మరియు మండలంలోని పలు గ్రామాల రైతులు హాజరై వీక్షించారు.రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక చొరవతో ప్రారంభమైన ఈ వినూత్న కార్యక్రమం గత రెండున్నర సంవత్సరాలుగా రాష్ట్రవ్యాప్తంగా రైతులకు అత్యంత ఉపయోగకరమైన వేదికగా నిలిచింది.రాష్ట్రంలోని రైతు వేదికలను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నేరుగా వ్యవసాయ శాస్త్రవేత్తలతో అనుసంధానం చేసి, పంటల సాగు, వాతావరణ పరిస్థితులు, చీడపీడల యాజమాన్యం, పోషక నిర్వహణ, ప్రత్యామ్నాయ పంటలు, నూతన సాంకేతిక పరిజ్ఞానాలపై శాస్త్రీయ సూచనలను రైతులకు ఎప్పటికప్పుడు అందిస్తుంది రైతు నేస్తం ప్రోగ్రాం 100వ ఎపిసోడ్ పూర్తి అయిన సందర్భంగా కేసముద్రం రైతు వేదిక యందు ప్రకృతి వ్యవసాయం చేస్తున్న కాల్వల గ్రామ రైతు ఘంట దామోదర్ రెడ్డి కి, మరియు ఆయిల్ ఫామ్, సపోటా, ఇతర పంటలను సాగు చేస్తున్న మరియు ప్రతి మంగళవారం నిర్వహించే రైతు నేస్తం ప్రోగ్రాం కు క్రమం తప్పకుండా వచ్చి శాస్త్రవేత్తల సలహాలు సూచనలు పాటించినటువంటి అభ్యుదయ రైతు శ్రీ పెరటి వెంకట్రాం నర్సయ్య ,కి కేసముద్రం రైతు వేదిక యందు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో శాలువాతో ఘనంగా సన్మానించడం జరిగింది.అనంతరం రైతు వేదికలో నిర్వహిస్తున్నటువంటి ఆరుతడి పంటల విత్తనమేల కార్యక్రమంలో భాగంగా రైతులకు రాయితీ మీద పెసర,కంది విత్తనాలను రైతులకు పంపిణీ చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో కేసముద్రం మండల వ్యవసాయ అధికారి బి వెంకన్న, ఆయా క్లస్టర్ల వ్యవసాయ విస్తరణ అధికారులు, రాజీవ్ లోషన్, శ్రీకాంత్,లావణ్య మరియు రైతులు పాల్గొన్నారు.



## ప్రజా పంపిణీ ద్వారా ప్రజలకు స్టీమ్ రైస్ అందేలా ఏర్పాట్లు

అమరావతి, జులై 28 ప్రజాపంపిణీ వ్యవస్థలో ప్రజలకు స్టీమ్ రైస్ అందించడం ద్వారా వారికి పౌర సరఫరాల శాఖ సేవలను మరింత చేరువ చేయొచ్చు. దీనిద్వారా ప్రజలకు నాణ్యమైన బియ్యం అందడంతో పాటు, బియ్యం అక్రమ రవాణా నిరోధానికి ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది. దీనికి కేంద్ర పౌర సరఫరాల శాఖ సహకారం ఎంతో అవసరం అని రాష్ట్ర పౌర సరఫరాల శాఖామాత్యులు నాదెండ్ల మనోహర్ చెప్పారు. రెండు రోజుల ఢిల్లీ పర్యటనలో భాగంగా ఆయన ఢిల్లీలో కేంద్ర పౌర సరఫరాల శాఖామాత్యులు ప్రహ్లాద్ జోషితో పాటు శాఖ ఉన్నతాధికారులను వరుసగా కలిశారు. నేషనల్ కోఆపరేటివ్ కన్స్యూమర్స్ ఫెడరేషన్ (ఎన్సీసీఎఫ్) ఎండీ అనీస్ జోసఫ్‌ని కలిసి రాష్ట్రంలో 1000 "మీమార్టు" ల ఏర్పాటుపై తగిన సహకారం కోరుతూ ఎంఓయూ చేసుకున్నారు. అనంతరం కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, ప్రజాపంపిణీ శాఖ జాయింట్ సెక్రటరీ రవిశంకర్, పాలసీ అండ్ ఎఫ్సీఐ జాయింట్ సెక్రటరీ శిఖాని కలిశారు. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో చేపట్టబోయే అంశాలపై చర్చించారు.

# పౌర సేవలను మరింత
# వేగం చేయడమే లక్ష్యం




**ఇల్లందు ప్రతినిధి జులై 28, ( తరంగాలు)** :పట్టణాల సమగ్ర రూపాంతరమే ధ్యేయంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సి.డి.ఎం.ఎ సంయుక్తంగా చేపట్టిన పురపాలక ప్రజాప్రతినిధుల ప్రత్యేక శిక్షణా తరగతులు గచ్చిబౌలిలోని ప్రతిష్టాత్మక ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా ప్రాంగణంలో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ ఉన్నత స్థాయి శిక్షణా కార్యక్రమానికి ఇల్లందు మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ సహా కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు,మున్సిపల్ అధికారులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.పౌర సేవలను మరింత వేగవంతం చేయడం, పట్టణాల్లో ఆధునిక మౌలిక వసతుల కల్పనను మెరుగుపరచడమే లక్ష్యంగా 'ఎస్సిఐ' ఆడిటోరియంలో నిపుణులు ప్రత్యేక సెషన్లు నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీల్లో తడి-పొడి చెత్త నిర్వహణ, ప్రతి ఇంటి నుండి క్రమం తప్పకుండా చెత్త సేకరణ , పారిశుధ్య



ఇల్లందు పురపాలక సంఘం పరిధిలో అమలు చేసి పట్టణాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని ఇల్లందు పాలకవర్గం తెలియజేసింది.ఈ ప్రతిష్టాత్మక శిక్షణా కార్యక్రమంలో ఇల్లందు మున్సిపల్ చైర్మన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్, వైస్ చైర్మన్ పెండ్యాల రాజు , మున్సిపల్ మేనేజర్ శ్రీనివాస్ రావు, వార్డు కౌన్సిలర్లు సైదుమియ, చిల్లా భారతి, రాధా కోరి, గోపగాని రాజు, రేఖ స్వరూప, గందే పద్మ, మెరుగు కార్తీక్, మొగిలి లక్ష్మి, రంప రమ్య, నిరుడు ఉపేంద్ర, సోని బాయి కోరి, ఉల్లింగా విజయలక్ష్మి, ఎం.డి.జాఫర్, నీలపు రమేష్, కొర్లపాటి శివ కిరణ్, కో-ఆప్షన్ సభ్యులు మడుగు సాంబమూర్తి, పర్రే స్వర్ణలత తదితరులు శిక్షణ పొందారు. శిక్షణ అనంతరం ఎమ్మెల్యే కోరం కనకయ్య ను ఎమ్మెల్యే క్వాటర్స్ నందు కలవడం జరిగింది.

పనుల పర్యవేక్షణపై విస్తృతంగా అవగాహన కల్పించారు. డి.ఆర్.సి.సి కేంద్రాల్లో చెత్తను శాస్త్రీయంగా వినియోగించి నాణ్యమైన ఎరువులను ఎలా తయారు చేయాలో వివరించారు. అలాగే పట్టణ ప్రణాళిక, ఆధునిక రహదారులు, కాలువల అభివృద్ధి, మురుగునీరు ఎక్కడికక్కడ నిల్వ లేకుండా చేసే ఇంజనీరింగ్ మెళకువలను ప్రజాప్రతినిధులకు తెలియజేశారు. మున్సిపల్ స్వయం సమృద్ధిని పెంచే దిశగా వార్డుల వారీగా ఇంటి పన్ను, నీటి పన్ను, వ్యాపార పన్నుల సేకరణను ముమ్మరం చేసే వ్యూహాలపై చర్చించారు. గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా వేదికగా నేర్చుకున్న ఆధునిక పాలన పద్ధతులను నూతన టెక్నాలజీని



## కేసముద్రం మార్కెట్‌లో మొక్కజొన్న ఎగుమతి పనులు స్థానిక కార్మికులకే కల్పించాలి

- తెలంగాణ హమాలీ అండ్ మిల్ వర్కర్స్ యూనియన్ ఐ ఎఫ్ టీ యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివారపు శ్రీధర్




**కేసముద్రం,మహబూబాబాద్ జిల్లా, ప్రతినిధి,జులై.28, తరంగాలు**:కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌లో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో దిగుమతి చేసిన మొక్కజొన్నల ఎగుమతి పనులను స్థానిక హమాలీ కార్మికులకే అప్పగించాలని తెలంగాణ హమాలీ అండ్ మిల్ వర్కర్స్ యూనియన్ ఐ ఎఫ్ టీ యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివారపు శ్రీధర్ డిమాండ్ చేశారు.?ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గత మార్చి నుండి మే నెల వరకు కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసేందుకు ప్రభుత్వం పెద్ద ఎత్తున పంటల కొనుగోలు చేపట్టిందని గుర్తుచేశారు. ఆ సమయంలో జిల్లా యంత్రాంగమంతా మార్కెట్ యార్డ్‌పైనే దృష్టి సారించి పనిచేసిందన్నారు.అధికారుల సూచనలను గౌరవిస్తూ, స్థానిక హమాలీ కార్మికులు అలాగే గత ఐదు ఆరు సంవత్సరాలుగా మార్కెట్‌నే నమ్ముకుని జీవిస్తున్న బిహారీ వలస కార్మికులు ఎటువంటి ఘర్షణలకు తావులేకుండా సమన్వయంతో పనులు పూర్తి చేశారని తెలిపారు.రైతులకు ఇబ్బంది కలగకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించడం కేసముద్రం కార్మికుల ప్రత్యేకత అని పేర్కొన్నారు.?తీవ్రమైన ఎండలను సైతం లెక్కచేయకుండా రైతుల సేవలో అహర్నిశలు శ్రమించిన స్థానిక హమాలీ కార్మికులకు, ఇప్పుడు మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో జరుగుతున్న మొక్కజొన్నల ఎగుమతి పనుల్లో మొదటి ప్రాధాన్యత ఇచ్చి ఉపాధి కల్పించాలని ఆయన సంబంధిత మార్కెట్ అధికారులను, ప్రభుత్వాన్ని కోరారు.

## కట్టంగూర్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్



**నల్గొండ, జులై 28,తరంగాలు :**
నల్గొండ జిల్లా కట్టంగూర్ పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని రికార్డులు, కేసుల దర్యాప్తు పురోగతి, పెండింగ్ కేసుల స్థితి, సీసీ కెమెరాల పనితీరు, స్టేషన్ నిర్వహణ, సిబ్బంది హాజరు వివరాలను పరిశీలించారు.పెండింగ్ కేసులను త్వరితగతిన పూర్తి చేసి బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రౌడీషీటర్లు, హిస్టరీషీటర్లు, బెయిల్‌పై ఉన్న నేరస్థులపై నిరంతర నిఘా కొనసాగించడంతో పాటు, అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలపై తరచూ నాకాబందీలు, వాహన తనిఖీలు నిర్వహించాలని సూచించారు.నేషనల్ హైవే పై రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఎస్పీ ఆదేశించారు. అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం, హెల్మెట్, సీటుబెల్ట్ నిబంధనలు ఉల్లంఘించే వారిపై ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, బ్లాక్‌స్పాట్‌ల వద్ద అప్రమత్తంగా విధులు నిర్వహిస్తూ ప్రజల్లో రోడ్డు భద్రతపై అవగాహన పెంచాలని సూచించారు.అలాగే సైబర్ నేరాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని, ఆన్‌లైన్ మోసాలపై వచ్చే ఫిర్యాదులపై వెంటనే స్పందించి బాధితులకు అవసరమైన సహాయం అందించాలని ఆదేశించారు. ప్రజల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదును సున్నితంగా స్వీకరించి చట్టపరమైన చర్యలను వేగవంతంగా చేపట్టాలని సూచించారు. పోలీస్ స్టేషన్ పరిశుభ్రత, రికార్డుల నిర్వహణ, సిబ్బంది క్రమశిక్షణ, ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించే విధానంపై ప్రత్యేక దృష్టి సారించిన ఎస్పీ, అనంతరం స్టేషన్ సిబ్బందితో సమావేశమై శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, బాధితులకు సత్వర న్యాయం అందించడం ప్రతి పోలీసు అధికారి ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు.

# న్యాయం కోసం జాతీయ
# ఎస్టి కమిషనర్ ను ఆశ్రయించిన ఆదివాసీ మహిళ



ఆదివాసి మహిళకు అండగా తుడుందెబ్బ నేతలు

ఇల్లందు ప్రతినిధి జులై 28,( తరంగాలు): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలం ముత్యాలంపాడు గ్రామానికి చెందిన చాపల యశోద (ఎస్టి ), గ్రామ పంచాయితీలో కూలీగా విధులు నిర్వహిస్తూ ఒక వివాదం ఏర్పడి ఆమె పెద్దల సమక్షంలో రాతపూర్వకంగా పరిష్కరించుకున్నప్పటికీ, ఆ పత్రం ఆమెకు అందించకుండా అడ్డుపడ్డారని తెలిపారు. ఆ పత్రంలో ఏమి రాశారో నేటికీ ప్రశ్నార్థకంగానే ఉందని పేర్కొన్నారు. టేకులపల్లి స్థానిక అధికార పార్టీ మండల అధ్యక్షులుగా కొనసాగుతున్న వ్యక్తి ఆ పత్రం దాచి ఉంచడంలో మర్మం ఏమిటి....? తాను వివాదంలో రాసుకున్న పత్రాన్ని ఆమెకు అందించకుండా వేధిస్తుండటంపై అనేక అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి....? తనను కలిసేంతవరకు ఆ పత్రం ఇచ్చేది లేదని కళాఖండిగా చెబుతూ బెదిరిస్తున్నారని పేర్కొనడం గమనర్హం. పంచాయితీ లో తాను చేసే విధుల నుండి తిఇస్తానని అనడం, (ఎస్టీ) కుల పెద్దలతో మాట్లాడి గ్రామంలో ఎటువంటి కార్యక్రమాలు జరిగిన మా కుటుంబాన్ని పిలవకుండా చేశారని ఆమె భావోద్వేగానికి లోనయ్యారు.తాను చెప్పినట్లు వినకపోతే కులబహిష్కరణ చేస్తాననడంతో దిక్కు తోచని పరిస్థితుల్లో ఆదివాసి హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బను ఆశ్రయించడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంలో ఆదివాసీ నేతలు మాట్లాడుతూ ఆదివాసి గిరిజనులను, గిరిజనేతరులు ఏ విధంగా శాసిస్తున్నారో అర్థం అవుతుందని, నా మాట వినకపోతే మీ ఆదివాసి గూడనే లేపేస్తానని అన్న సందర్భాలు కూడా ఉన్నాయన్నారు. అతని బెదిరింపులు భరించలేక ఆదివాసి హక్కుల పోరాట సమితి ( తుడుం దెబ్బ) దృష్టికి ఆమె తీసుకురావడం జరిగిందని, ఆదివాసి గిరిజనులపై పెత్తనం చెలాయిస్తూ,మహిళను వేధిస్తున్న విషయంపై జాతీయ ఎస్టి కమిషనర్ దృష్టికి తీసుకు వెళ్లగా, జాతీయ ఎస్టి కమిషన్ స్పందించడం జరిగిందని తెలిపారు. ఇట్టి విషయంపై పూర్తి విచారణ చేపట్టి ఆదివాసి మహిళను వేధిస్తూ బెదురుంపులకు పాల్పడిన వ్యక్తిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గోగ్గెల రామస్వామి, జార కృష్ణ, ఈసం నరసింహారావు, పూనెం కోటయ్య, రాంబాబు ఓ ప్రకటనలో పేర్కొన్నారు.




## డా. ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం మరో వినూత్న అడుగు

విజయవాడ, జూలై 28 .విద్యార్థుల సమగ్రాభివృద్ధిని లక్ష్యంగా చేసుకుని డా. ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం (డా. ఎన్టీఆర్ యూహెచ్ఎస్), విజయవాడ తొలిసారిగా నిర్వహిస్తున్న ఇంటర్ కాలేజియేట్ కల్చరల్ మీట్ 2026' కర్టెన్ రైజర్ కార్యక్రమాన్ని విశ్వవిద్యాలయ గౌరవ ఉపకులపతి డా. పి. చంద్రశేఖర్, రిజిస్ట్రార్ డా. టి. సాయి సుధీర్ మంగళవారం విశ్వ విద్యాలయంలో సంయుక్తంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఉపకులపతి డా. పి. చంద్రశేఖర్ మాట్లాడుతూ.. విద్యా ప్రమాణాల పెంపుతో పాటు విద్యార్థుల్లో దాగి ఉన్న కళా ప్రతిభ, సృజనాత్మకత, నాయకత్వ లక్షణాలు, జట్టు స్ఫూర్తి, సమగ్ర వ్యక్తిత్వ వికాసానికి విశ్వవిద్యాలయం సమాన ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అనుబంధ మెడికల్, డెంటల్ కళాశాలల విద్యార్థులు తమ ప్రతిభను చాటుకోవడానికి, పరస్పరం అనుభవాలను పంచుకోవడానికి, ఆరోగ్యకరమైన పోటీ స్ఫూర్తిని పెంపొందించుకోవడానికి ఈ ఇంటర్ కాలేజియేట్ కల్చరల్ మీట్2026 ఉత్తమ వేదికగా నిలుస్తుందన్నారు. తొలిసారిగా నిర్వహిస్తున్న ఈ సాంస్కృతిక మహోత్సవం భావి వైద్యుల్లో ప్రతిభను వెలికితీయడమే కాకుండా సృజనాత్మకత, స్నేహభావం, ఐక్యత, సాంస్కృతిక విలువలను మరింత బలోపేతం చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఈ కార్యక్రమం విశ్వవిద్యాలయం ప్రతిష్ఠాత్మక వార్షిక వేడుకగా రూపుదిద్దుకుంటుందని పేర్కొన్నారు.రిజిస్ట్రార్ డా. టి. సాయి సుధీర్ మాట్లాడుతూ, విద్యార్థుల సమగ్రాభివృద్ధికి ఇటువంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని అన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, సంభాషణా నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలు, జట్టు భావన మరింత పెరుగుతాయని తెలిపారు. వైద్య విద్యతో పాటు వ్యక్తిత్వ వికాసానికీ విశ్వవిద్యాలయం సమాన ప్రాధాన్యత ఇస్తోందని స్పష్టం చేశారు.ఆగస్టు 12, 14 వరకు ఎన్ఆర్ఐ మెడికల్ కళాశాలలో నిర్వహణఇంటర్ కాలేజియేట్ కల్చరల్ మీట్?2026 ను ఆగస్టు 12 నుంచి 14 వరకు గుంటూరు జిల్లా చినకాకానిలోని ఎన్ఆర్ఐ మెడికల్ కళాశాలలో నిర్వహించనున్నారు.

# ప్యారడైజ్ స్పెషల్ సాంగ్ కోసం కీర్తి సురేశ్?

నేచురల్ స్టార్ నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న భారీ పాన్ ఇండియా చిత్రం ది ప్యారడైజ్ పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. 'దసరా' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత వీరిద్దరి కాంబోలో వస్తున్న సినిమా కావడంతో అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో సినిమాకు సంబంధించిన ఓ వార్త ఇప్పుడు ఫిలింనగర్‌లో చర్చనీయాంశంగా మారింది. తాజా ప్రచారం ప్రకారం, ఈ చిత్రంలో ఉండే ఓ హై-వోల్టేజ్ మాస్ స్పెషల్ సాంగ్ కోసం జాతీయ అవార్డు గ్రహీత కీర్తి సురేష్‌ను తీసుకోవాలని మేకర్స్ ఆలోచిస్తున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. అయితే దీనిపై ఇప్పటివరకు చిత్రబృందం నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. ఈ ప్రచారం నిజమైతే నాని, కీర్తి సురేష్ కాంబినేషన్ మరోసారి ప్రేక్షకుల ముందుకు రానుంది. గతంలో వీరిద్దరూ కలిసి నటించిన 'నేను లోకల్' మంచి విజయాన్ని అందుకుంది. అనంతరం శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో వచ్చిన దసరాస లోనూ ఈ జంట మరోసారి ఆకట్టుకుని బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని నమోదు చేసింది.





ఇప్పుడు అదే దర్శకుడు తెరకెక్కిస్తున్న ది ప్యారడైజ్ లో కీర్తి సురేష్ ప్రత్యేక గీతంలో కనిపించే అవకాశం ఉందనే వార్త అభిమానుల్లో ఆసక్తిని మరింత పెంచుతోంది. ఈ చిత్రానికి సంగీత దర్శకుడిగా అనిరుధ్ రవిచందర్ పని చేస్తున్నారు. ఇప్పటికే ఆయన అందించిన పాటలు దేశవ్యాప్తంగా భారీ ఆదరణ పొందుతున్నాయి. ఒకవేళ కీర్తి సురేష్ స్పెషల్ సాంగ్‌లో కనిపిస్తే, అనిరుధ్ మాస్ బీట్‌కు ఆమె డ్యాన్స్ మరో ప్రత్యేక ఆకర్షణగా నిలిచే అవకాశముందని సినీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. కీర్తి సురేష్ తెలుగు ప్రేక్షకులకు 'నేను శైలజ' సినిమాతో పరిచయమయ్యారు. తొలి చిత్రంతోనే తన సహజ నటనతో ప్రేక్షకులను ఆకట్టుకున్న ఆమె, తర్వాత మహానటి లో సావిత్రి పాత్రను అద్భుతంగా పోషించి జాతీయ ఉత్తమ నటి అవార్డును అందుకున్నారు. ఆ తర్వాత 'సర్కారు వారి పాట', 'భోళా శంకర్' వంటి పెద్ద చిత్రాల్లో నటించి తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. కమర్షియల్ చిత్రాలతో పాటు నటనకు ప్రాధాన్యం ఉన్న పాత్రలను కూడా సమానంగా ఎంపిక చేసుకుంటూ ముందుకు సాగుతున్నారు. ప్రస్తుతం కీర్తి సురేష్ పలు క్రేజీ ప్రాజెక్ట్‌లతో బిజీగా ఉన్నారు. విజయ్ దేవరకొండ సరసన తెరకెక్కుతున్న 'రౌడీ జనార్దన్' చిత్రంతో పాటు, దర్శకుడు అనిల్ రావిపూడి రూపొందిస్తున్న వెంకటేష్,కళ్యాణ్ రామ్ మల్టీస్టారర్ చిత్రంలో కూడా ఆమె కథానాయికగా నటిస్తున్నారు2. ఈ క్రమంలో ది ప్యారడైజ్ లో స్పెషల్ సాంగ్ చేసే అవకాశం ఉందనే ప్రచారం మరింత ఆసక్తిని రేకెత్తిస్తోంది.

# హారర్ థ్రిల్లర్ '418' విడుదల వాయిదా




మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాణంలో రూపొందుతున్న హారర్ థ్రిల్లర్ '418' కోసం ఎదురుచూస్తున్న సినీ అభిమానులకు స్వల్ప నిరాశ ఎదురైంది. జూలై 31న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కావాల్సిన ఈ చిత్రాన్ని వాయిదా వేస్తున్నట్లు చిత్ర నిర్మాణ సంస్థ అధికారికంగా ప్రకటించింది. సోషల్ మీడియా వేదికగా ఈ విషయాన్ని వెల్లడించిన మైత్రీ మూవీ మేకర్స్, సినిమా విడుదలను వాయిదా వేస్తున్నామని తెలిపింది. అయితే ఈ నిర్ణయం వెనుక ఉన్న కారణాలను మాత్రం వెల్లడించలేదు. త్వరలోనే కొత్త విడుదల తేదీని ప్రకటిస్తామని అభిమానులకు హామీ ఇచ్చింది. ప్రస్తుతం చిత్రబృందం విడుదల వాయిదాకు సంబంధించి ఎలాంటి అధికారిక కారణం చెప్పలేదు. దీంతో సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనులు, విజువల్ ఎఫెక్ట్స్, సాంకేతిక అంశాలు లేదా విడుదల ప్రణాళికలో మార్పుల వల్ల ఈ నిర్ణయం తీసుకున్నారా అనే చర్చ సినీ వర్గాల్లో సాగుతోంది. అయితే ఈ అంశాలపై అధికారిక స్పష్టత రావాల్సి ఉంది. '418' ఒక ఇంటెన్స్ హారర్ థ్రిల్లర్‌గా రూపొందుతోంది. ఇప్పటికే విడుదలైన ప్రచార సామగ్రి సినిమాపై ఆసక్తిని పెంచింది. ముఖ్యంగా సస్పెన్స్, భయానక అంశాలతో కథను తెరకెక్కిస్తున్నట్లు ప్రచారం జరుగుతుండటంతో ఈ సినిమాపై ప్రేక్షకుల్లో మంచి అంచనాలు ఏర్పడ్డాయి. ఈ చిత్రంలో ప్రీతి పగడాల కథానాయికగా నటిస్తున్నారు. ఆమెతో పాటు చరణ్ లక్కరాజు, సూర్య రాజ్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. కొత్త తరహా కథాంశంతో తెరకెక్కుతున్న ఈ సినిమాలో ప్రతి పాత్రకూ కథలో ప్రత్యేక ప్రాధాన్యం ఉంటుందని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఈ చిత్రానికి మరో ప్రధాన ఆకర్షణ దర్శకుడు ప్రశాంత్ నీల్ మద్దతు. ఆయన ఈ ప్రాజెక్ట్‌కు అనుబంధంగా ఉండటం వల్ల 418 పై ప్రారంభం నుంచే మంచి బజ్ ఏర్పడింది. ఆయన పేరు జత కావడంతో సినిమా స్థాయిపై ప్రేక్షకుల్లో ఆసక్తి మరింత పెరిగింది. ఈ చిత్రానికి కీర్తన్ నాదగౌడ దర్శకత్వం వహిస్తుండగా, వెంకీ జీజీ సంగీతం అందిస్తున్నారు. హారర్‌తో పాటు థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌ను సమపాళ్లలో మేళవిస్తూ దర్శకుడు సినిమాను రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. విడుదల వాయిదా పడినప్పటికీ, సినిమా విడుదలపై చిత్రబృందం పూర్తి నమ్మకంతో ఉంది. కొత్త విడుదల తేదీని త్వరలోనే ప్రకటిస్తామని మైత్రీ మూవీ మేకర్స్ స్పష్టం చేసింది. దీంతో అభిమానులు ఇప్పుడు కొత్త రిలీజ్ డేట్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# డిఫరెంట్ లవ్ స్టోరీ..చెన్నై లవ్ స్టోరీపై నాగచైతన్య

తనకు ప్రేమకథలంటే ఇష్టమన్నారు నటుడు నాగ చైతన్య. కొవిడ్ తర్వాత లవ్‌స్టోరీలు తెరకెక్కట్లేదని తాను బాధపడినట్లు చెప్పారు. కిరణ్ అబ్బవరం హీరోగా వచ్చిన తాజా చిత్రం 'చెన్నైలవ్ స్టోరీ'. ఈ సినిమా ప్రేక్షకాదరణ సొంతం చేసుకోవడంతో సక్సెస్ మీట్ నిర్వహించారు. ఈ ఈవెంట్‌కు నాగచైతన్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కొవిడ్ తర్వాత ప్రేమకథలు రావట్లేదని భయపడ్డా. ప్రేక్షకులు థియేటర్‌లకు వెళ్తారా.. ప్రేమకథలు చూస్తారా? అని అనుకున్నాను. ఇప్పుడు మళ్లీ ఆ ట్రెండ్ ప్రారంభమైంది. 'చెన్నై లవ్‌స్టోరీ'తో మంచి ప్రేమకథను అందించారు. ఇప్పటి వరకూ ఇద్దరు ప్రేమించుకోవడం పెళ్లి చేసుకోవడం ఇలాంటి కథలే చూశాం. కానీ, బ్రేకప్ ప్రేమకథ ఎలా ఉంటుందనేది ఇందులో చూపించారు.



ఇప్పటి తరానికి బాగా కనెక్ట్ అయ్యే కథ ఇది. ఇలాంటి స్టోరీలు రావాలని ఎంతో ఎదురుచూశా. ఈ చిత్రం చూసిన తర్వాత చాలా ఆనందించా' అని నాగచైతన్య అన్నారు. సాయి రాజేశ్ ఈ కథను చాలా గొప్పగా రాశారని ప్రశంసించారు. కిరణ్ అబ్బవరం ఎన్నో ఒడుదొడుకులు ఎదుర్కొని ఈ స్థాయికి వచ్చారని నాగచైతన్య అన్నారు. 'క' సినిమా ఈవెంట్‌లో కిరణ్ స్పీచ్ విని తాను ఎంతో బాధపడినట్లు చెప్పారు. సినిమా కోసం కిరణ్ ఎంతో కష్టపడతాడని తెలిపారు. శ్రీ గౌరీ ప్రియ కెరీర్‌లో ఈ సినిమా ఎప్పటికీ నిలిచిపోతుందన్నారు. ఈ చిత్రబృందమంతా ఎంతో కష్టపడి వర్క్ చేసిందని.. కొత్త వాళ్లను ప్రోత్సహించడంలో నిర్మాత ఎస్‌కేఎన్, దర్శకుడు సాయి రాజేశ్ ఎప్పుడు ముందుంటారని తెలిపారు.

## ట్రోల్స్‌ను అస్సలు పట్టించుకోవద్దు

### అభిమానులకు అల్లు అర్జున్ సూచన



ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ తన అభిమానులతో ప్రత్యేకంగా సమావేశమ య్యారు. హైదరాబాద్‌లోని యూసుఫ్‌గూడ శౌర్య భవన్‌లో అల్లు అర్జున్ ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన సుమారు 600 మందికి పైగా అభిమానులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన అల్లు అర్జున్, సోషల్ మీడియాలో నిత్యం ఎదురయ్యే అనవసరపు ట్రోల్స్, నెగెటివిటీపై తీవ్రంగా స్పందించారు. నెట్టింట జరిగే దుష్ప్రచారాలను, అనవసర వివాదాలను అస్సలు పట్టించుకోవద్దని, వాటికి ఎలాంటి స్పందన ఇవ్వకుండా సంయమనం పాటించాలని తన అభిమానులకు ఆయన హితవు పలికారు. అభిమానులందరూ సానుకూల ధోరణితో ముందుకు సాగాలని, తమ సమయాన్ని, శక్తిని మంచి పనులకే వెచ్చించాలని బన్నీ ఈ వేదికగా సందేశమిచ్చారు. అభిమానుల ఆప్యాయతకు కృతజ్ఞతలు తెలిపిన ఆయన, వారితో కలిసి ఫోటోలు దిగుతూ సందడి చేశారు. సినిమాల విషయానికి వస్తే.. అల్లు అర్జున్ ప్రస్తుతం అట్లీతో రాకా సినిమా చేస్తున్నాడు ఈ చిత్రంలో దీపికా పదుకొనే కథానాయికగా నటిస్తుండగా.. కళనిధి మారాన్ భారీ బ్జడెట్‌తో నిర్మిస్తున్నాడు. ఈ చిత్రం అనంతరం లోకేష్ కనగరాజ్‌తో సినిమా చేయబోతున్నాడు బన్నీ.

## బట్వారా 1947 ట్రైలర్ విడుదల




బాలీవుడ్ యాక్షన్ స్టార్ సన్నీ డియోల్ నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ హిస్టారికల్ డ్రామా 'బట్వారా 1947' నుంచి క్రేజీ అప్‌డేట్ వచ్చింది. తాజాగా ఈ సినిమా నుంచి ట్రైలర్‌ను విడుదల చేశారు. దేశ విభజన నాటి భయానక పరిస్థితులు, ద్వేషం మధ్య ఒక వ్యక్తి చూపించిన అసాధారణ ధైర్యం నేపథ్యంలో సాగే భావోద్వేగభరిత చిత్రంగా ఈ చిత్రం రాబోతున్నట్లు ట్రైలర్ చూస్తే అర్థమవుతుంది. ఇక ఈ చిత్రాన్ని స్వాతంత్ర్య దినోత్సవ కానుకగా ఆగస్టు 14న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. గతంలో 'ఘాయల్', 'దామిని', 'ఘాతక్' వంటి ఇండస్ట్రీ హిట్లను అందించిన స్టార్ డైరెక్టర్ రాజ్‌కుమార్ సంతోషి, సన్నీ డియోల్ కాంబినేషన్‌లో చాలా ఏళ్ల తర్వాత వస్తున్న సినిమా కావడంతో దీనిపై భారీ అంచనాలు ఉన్నాయి. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌ను మిస్టర్ పర్ఫెక్ట్ ఆమిర్ ఖాన్ తన 'ఆమిర్ ఖాన్ ప్రొడక్షన్స్' బ్యానర్‌పై అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తుండటం విశేషం. ఈ చిత్రంలో సన్నీ డియోల్ సరసన సీనియర్ స్టార్ హీరోయిన్ ప్రీతి జింతా నటిస్తుండగా, శబానా అజ్మీ, అలీ ఫజల్, కరణ్ డియోల్, కనికా కపూర్, సర్గమ్ సింగ్, ఖుషీ హజారే కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఆస్కార్ గ్రహీత ఎ.ఆర్. రెహమాన్ ఈ చిత్రానికి అద్భుతమైన సంగీతాన్ని అందిస్తున్నారు.

## రిజర్వేషన్లపై తన పేరుతో తప్పుడు ప్రచారాలు

### వాటిని నమ్మవద్దని కోరిన నటి శిల్పాశెట్టి



రిజర్వేషన్ల అంశంపై తన పేరుతో సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న పోస్టులు పూర్తిగా అబద్ధమని, తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని నటి శిల్పా శెట్టి తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు ఆమె ఎక్స్ వేదికగా ఒక ప్రకటన విడుదల చేస్తూ.. తన పేరును ఉపయోగిస్తూ కొందరు కావాలని నిందలు వేస్తున్నారని, అది పూర్తిగా కల్పితమైన వార్త అని స్పష్టం చేశారు. నా పేరును ఉపయోగిస్తూ రిజర్వేషన్లపై వైరల్ అవుతున్న తప్పుడు ప్రకటనలు చూసి తీవ్ర షాక్‌కు గురయ్యాను. ఇది పూర్తిగా కల్పితం మరియు దుర్బుద్ధితో కూడిన చెత్త ప్రచారం. ఇలాంటి ఫేక్ న్యూస్‌ను ఎవరూ నమ్మకండి అంటూ శిల్పా రాసుకొచ్చింది. రిజర్వేషన్ వ్యవస్థను ఉద్దేశించి వైద్యులు, కులాల ఆధారంగా రోగులకు చికిత్స చేయాలంటూ శిల్పా శెట్టి ఇన్‌స్టాగ్రామ్ స్టోరీ పెట్టినట్లుగా ఒక స్క్రీన్‌షాట్ నెట్టింట తీవ్ర కలకలం రేపింది. అయితే ఈ వివాదం ముదరకముందే శిల్పా స్పందించి ఆ వార్తలకు తెరదించింది. ఇక సినిమాల విషయానికొస్తే, శిల్పా శెట్టి ఇటీవల ధ్రువ సర్జా, సంజయ్ దత్, రవిచంద్రన్ ప్రధాన పాత్రల్లో నటించిన 'కేడీ: ది డెవిల్' అనే కన్నడ చిత్రంలో కనిపించారు. ప్రస్తుతం ఆమె 'మా హై నా' అనే ప్రముఖ రియాలిటీ కుకింగ్ షోకి వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్నారు.

## విండీస్ ఆల్‌రౌండర్ జస్టిన్ గ్రీవ్స్ సరికొత్త చరిత్ర



టెస్టు క్రికెట్ చరిత్రలో ఎన్నడూ చూడని ఒక అపూర్వ ఘట్టానికి ట్రినిడాడ్ మైదానం వేదికైంది. పాకిస్థాన్‌తో జరుగుతున్న మొదటి టెస్టు మ్యాచ్ మూడో రోజు ఆటలో వెస్టిండీస్ స్టార్ ఆల్‌రౌండర్ జస్టిన్ గ్రీవ్స్ సంచలన బౌలింగ్ ప్రదర్శనతో అదరగొట్టాడు. వరుసగా ఐదు ఓవర్లలో ఒక్క పరుగు కూడా ఇవ్వకుండా ఐదు వికెట్లు తీశాడు. దీంతో అంతర్జాతీయ టెస్టు క్రికెట్ 148 ఏళ్ల సుదీర్ఘ చరిత్రలో ఈ ఘనత సాధించిన ఏకైక బౌలర్‌గా గ్రీవ్స్ రికార్డులకెక్కాడు. బలమైన స్థితిలో ఉన్న పాకిస్థాన్ ఇన్నింగ్స్‌ను గ్రీవ్స్ తన అద్భుతమైన స్వింగ్ బౌలింగ్‌తో కకావికలం చేశాడు. కేవలం 27 పరుగులు మాత్రమే ఇచ్చి 5 వికెట్లు పడగొట్టడం ద్వారా తన కెరీర్ బెస్ట్ బౌలింగ్ గణాంకాలను నమోదు చేశాడు. గతంలో ఇంగ్లాండ్ దిగ్గజ పేసర్ స్టువర్ట్ బ్రాడ్ 2016లో జోహ్యాన్నెస్‌బర్గ్ వేదికగా దక్షిణాఫ్రికాపై వరుసగా 4 వికెట్ మెయిడెన్ ఓవర్లు వేసి నమోదు చేసిన ఆల్ టైమ్ రికార్డును గ్రీవ్స్ బద్దలు కొట్టాడు. గ్రీవ్స్ ధాటికి పాకిస్థాన్ 282 పరుగులకే కుప్పకూలింది. దీంతో విండీస్ జట్టుకు తొలి ఇన్నింగ్స్‌లో 29 పరుగుల స్వల్ప ఆధిక్యం లభించింది. ఈ అద్భుత రికార్డుతో జస్టిన్ గ్రీవ్స్.. ప్రపంచ క్రికెట్‌లో మరోసారి చర్చనీయాంశంగా మారాడు. 2025 డిసెంబర్‌లో న్యూజిలాండ్‌పై నాలుగో ఇన్నింగ్స్‌లో 202 పరుగులతో అజేయంగా నిలిచి, ప్రపంచ దృష్టిని ఆకర్షించిన అతడు, గతేడాది శ్రీలంకపై 180 పరుగులు చేసి బ్యాటర్‌గా తన సత్తా చాటాడు. ఇప్పుడు బౌలింగ్‌లోనూ ప్రపంచ రికార్డు సృష్టించి, వెస్టిండీస్‌లో కీలక ఆల్‌రౌండర్‌గా తన స్థానాన్ని స్థిరపరుచుకున్నాడు. గ్రీవ్స్ సంచలన బౌలింగ్ చేసినప్పటికీ, మ్యాచ్‌లో పాకిస్థాన్ విజయావకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన వెస్టిండీస్ మూడో రోజు ఆట ముగిసే సమయానికి 126 పరుగులకే 7 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ప్రస్తుతం విండీస్ ఓవరాల్‌గా 155 పరుగుల ఆధిక్యంలో ఉంది. ఒకవేళ విండీస్ టెయిలెండర్లు పట్టుదలతో బ్యాటింగ్ చేసి.. 250కి పైగా లక్ష్యాన్ని పాక్‌కు నిర్దేశిస్తే మ్యాచ్ ఆసక్తికరంగా మారనుంది. అపుడు ఇరు జట్లకూ సమాన విజయావకాశాలు ఉంటాయి.

## అభిషేక్ బలహీనత ప్రత్యర్థులకు తెలిసిపోయింది

**అభిషేక్ శర్మపై కృష్ణమాచారి శ్రీకాంత్ వ్యాఖ్యలు**



అభిషేక్ శర్మ .. ఐపీఎల్‌లో సన్ రైజర్స్ హైదరాబాద్ తరఫున మెరుపులు మెరిపించి, ఆపై భారత్ తరఫున కూడా సత్తాచాటిన ఈ ప్లేయర్ ప్రస్తుతం ఫామ్‌లేమితో ఇబ్బంది పడుతున్నాడు. యూకే టూర్ సహా.. ఇటీవల జింబాబ్వే పర్యటనలో నూ అతడు ఆశించిన మేర రాణించలేకపో యాడు. దీంతో అతడిపై తీవ్రస్థాయిలో విమర్శలు వస్తున్నాయి. 2-3 మ్యాచ్‌లలో సరిగ్గా ఆడలేదనే కారణంతా టీ20 ప్రపంచకప్ 2026 హీరో సంజూ శాంసన్‌ను జట్టు నుంచి తప్పించినప్పుడు.. అభిషేక్‌కు ఎందుకు మినహాయింపు ఇస్తున్నారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇదే విషయంపై టీమిండియా మాజీ చీఫ్ సెలక్టర్ కృష్ణ మాచారి శ్రీకాంత్ స్పందించారు. అభిషేక్ విషయంలో కఠిన నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉందని క్రిస్ శ్రీకాంత్ వ్యాఖ్యానించారు. “టీ20 ప్రపంచ కప్ 2026 నుంచే ప్రత్యర్థులు అభిషేక్ శర్మ ఆట తీరును పసిగట్టేశారు. అతడి బలహీనతను గుర్తించి, ఎలా కట్టడి చేయాలో తెలుసుకున్నారు. పరుగులు చేయడంలో ఇబ్బంది పడుతున్న అభిషేక్ విషయంలో సెలక్టర్లు కఠినమైన నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని నాకు అనిపిస్తోంది. సంజూ శాంసన్‌కు మళ్లీ అవకాశం లభిస్తుందని భావిస్తున్నా” అని శ్రీకాంత్ పేర్కొన్నారు. ఇదే సమయంలో మయాంక్ యాదవ్‌పై ఆయన ప్రశంసలు కురిపించారు. “మయాంక్ యాదవ్ 3 మ్యాచ్‌లు ఆడటం బాగుంది. అతడి గురించి నాకు చాలా సంతోషంగా ఉంది. ఈ కుర్రాడు నిలకడగా రాణిస్తాడనే నమ్మకం ఉంది. అతనికి భారత క్రికెట్‌లో ఉజ్వల భవిష్యత్ ఉంది. అశోక్ శర్మ కూడా రాణిస్తున్నాడు. ప్రతిభావంతులైన యువ ఆటగాళ్లకు భారత టీమ్ మేనేజ్‌మెంట్ అండగా ఉండాలి” అని క్రిస్ శ్రీకాంత్ వివరించారు. కాగా ఇటీవల జింబాబ్వేతో ముగిసిన టీ20 సిరీస్‌లో అభిషేక్ దారుణ ప్రదర్శ చేశాడు. 3 ఇన్నింగ్స్‌ల్లో కలిపి కేవలం 11 రన్స్ మాత్రమే చేశాడు. ఈ మూడు మ్యాచ్‌లల్లో బ్లెస్సింగ్ ముజరబాని బౌలింగ్‌లోనే అతడు ఔట్ అయ్యాడు. అంతకుముందు ఐర్లాండ్, ఇంగ్లాండ్‌లతో జరిగిన సిరీస్‌ల్లో అభిషేక్ పెద్దగా ప్రభావం చూపలేకపోయాడు. మొత్తంగా అతడు గత 10 ఇన్నింగ్స్‌ల్లో 191 పరుగులు మాత్రమే చేశాడు.

# జడేజా, సారాంశ్‌కు జట్టులో చోటు

**శ్రీలంకతో టెస్టు సిరీస్‌కు భారత జట్టు ప్రకటన**



శ్రీలంకతో జరిగే రెండు టెస్టుల సిరీస్‌కు భారత జట్టును బీసీసీఐ ప్రకటించింది. రవీంద్ర జడేజా జట్టులోకి తిరిగి రాగా, యువ ఆల్‌రౌండర్ సారాంశ్ జైన్‌కు తొలిసారి జాతీయ జట్టులో చోటు దక్కింది. ఈ సిరీస్‌కి శుబ్‌మన్ గిల్ కెప్టెన్ కాగా, కె.ఎల్. రాహుల్ వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నట్లు సెలక్టర్లు ప్రకటించారు. గాయాలతో బాధపడుతున్న స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా, టాప్-ఆర్డర్ బ్యాటర్ బి. సాయి సుదర్శన్ జట్టులో ఎంపికైనప్పటికీ బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ నుంచి ఫిట్‌నెస్ క్లియరెన్స్ వస్తేనే వీరు బరిలోకి దిగనున్నారు. స్టార్ ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్ ప్రస్తుతం తొడ కండరాల గాయంతో బాధపడుతున్నారు. బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ లో ఆయన రీహాబిలిటేషన్ లో ఉన్నారు. శ్రీలంకతో జరిగే తొలి టెస్టు సమయానికి ఆయన పూర్తిగా కోలుకునే అవకాశాలు కనిపంచడం లేదు. ఈ నేపథ్యంలో తుది జట్టులో ముందే ఊహించినట్లుగానే సెలెక్టర్లు సారాంశ్ జైన్ వైపు మొగ్గు చూపారు. శ్రీలంక పర్యటనలో భాగంగా భారత జట్టు రెండు టెస్టులు ఆడనుంది. టెస్టు సిరీస్ ప్రారంభానికి ముందు, శ్రీలంక పరిస్థితులకు అలవాటుపడేందుకు ఆగస్టు 7 నుంచి భారత్ నాలుగు రోజుల వార్మప్ మ్యాచ్ ఆడుతుంది. ఆగస్టు 15 నుంచి 19 వరకు గాలే వేదికగా జరగనుంది. ఆగస్టు 23 నుండి 27 వరకు రెండో టెస్టు కొలంబో వేదికగా జరగనుంది. మధ్యప్రదేశ్ జట్టు రంజీ ట్రోఫీ విజేతగా నిలవడంలో సారాంశ్ జైన్ అత్యంత కీలక పాత్ర పోషించాడు. కోచ్ చంద్రకాంత్ పండిత్ మార్గదర్శకత్వంలో రూపుదిద్దుకున్న పొడవైన ఆఫ్‌స్పిన్నర్, పక్కా ప్రణాళికలతో ప్రత్యర్థి బ్యాటర్లను మెయిడిన్ ఓవర్లు, కచ్చితమైన లైన్ అండ్ లెంగ్త్‌తో కట్టడి చేయడంలో దిట్ట. ఇటీవల ఇండియా ‘ఎ’ శ్రీలంక పర్యటనలో సారాంశ్ బౌలింగ్?లో ప్రతిభ కనబర్చాడు. శ్రీలంక ‘ఎ’ జట్టుతో జరిగిన రెండు మ్యాచ్‌లలో 6 వికెట్లు పడగొట్టి ప్రత్యర్థి బ్యాటింగ్ ఆర్డర్‌ను దెబ్బతీశాడు. బౌలింగ్‌లోనే కాకుండా, కింది వరుస బ్యాటింగ్‌లో అత్యంత కీలకమైన సమయంలో ఒత్తిడిని జయించి 70 పరుగులు (నాటౌట్) చేసి సత్తాచాటాడు. సారాంశ్ దేశవాళీ క్రికెట్‌లోనూ అద్భుతమైన రికార్డును కలిగి ఉన్నాడు. 54 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌ల్లో 188 వికెట్లు పడగొట్టడంతో పాటు 2,223 పరుగులు చేశాడు. ఇందులో రెండు సెంచరీలు, 14 హాఫ్? సెంచరీలు ఉన్నాయి. దులీప్ ట్రోఫీలో రెండు మ్యాచ్‌ల్లోనే 16 వికెట్లు తీసి, 136 పరుగులు చేసి సెంట్రల్ జోన్ టైటిల్ గెలవడంలో కీలక పాత్ర పోషించాడు. అలాగే 2025-26 రంజీ ట్రోఫీ సీజన్‌లో 518 పరుగులు, 30 వికెట్లు సాధించి మరోసారి తన సత్తా చాటాడు. ఈ ప్రదర్శనలే అతడికి భారత టెస్టు జట్టులో చోటు కల్పించాయి. గతేడాది స్వదేశంలో దక్షిణాఫ్రికా చేతిలో 0-2తో సిరీస్ కోల్పోవడం, గుహవాటి టెస్టులో 408 పరుగుల భారీ తేడాతో ఓటమి పాలవడం భారత జట్టుకు ఎదురుదెబ్బగా నిలిచింది. ప్రస్తుతం డబ్ల్యూటీసీ పట్టికలో ఐదో స్థానంలో ఉన్న భారత్ ఈ సైకిల్‌లో ఇప్పటివరకు ఆడిన తొమ్మిది టెస్టుల్లో నాలుగింటిలో మాత్రమే విజయం సాధించింది. దీంతో శ్రీలంక సిరీస్ భారత జట్టుకు కీలకంగా మారింది.

**టీమ్‌ఇండియా జట్టు ఇదే**

శుబ్‌మన్ గిల్ (కెప్టెన్), కె.ఎల్. రాహుల్ (వైస్ కెప్టెన్), యశస్వి జైస్వాల్, రిషభ్ పంత్ (వికెట్ కీపర్), ధ్రువ్ జురెల్ (వికెట్ కీపర్), బి. సాయి సుదర్శన్, రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్, మానవ్ సుతార్, జస్‌ప్రీత్ బుమ్రా, మహమ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ, గుర్నూర్ బ్రార్, దేవ్‌దత్ పడిక్కల్, సారాంశ్ జైన్.

# భారత అథ్లెట్లు అద్భుత ప్రదర్శన

- భారత్‌కు దక్కిన తొలి స్వర్ణ పతకం
- ఒకే రోజు ఆరు పతకాలు కైవశం



గ్లాస్గో కామన్వెల్త్ క్రీడల్లో భారత అథ్లెట్లు అద్భుత ప్రదర్శనతో పతకాల వేట కొనసాగిస్తున్నారు. ట్రాక్ అండ్ ఫీల్డ్, వెయిట్‌లిఫ్టింగ్, బాక్సింగ్ విభాగాల్లో భారత క్రీడాకారులు సత్తా చాటుతూ దేశానికి వరుస విజయాలు అందిస్తున్నారు. పారా అథ్లెటిక్స్‌లో షర్మిలా ధన్‌ఖడ్ చారిత్రక స్వర్ణ పతకం సాధించగా, హైజంప్‌లో సర్వేష్ కుషారే రజతంతో చరిత్ర సృష్టించాడు. వెయిట్‌లిఫ్టింగ్‌లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన అజయ్ బాబు ఒక్క కిలో తేడాతో స్వర్ణం చేజార్చుకుని రజతంతో సరిపెట్టుకున్నాడు.పారా అథ్లెటిక్స్ మహిళల షాట్‌పుట్ ఎఫ్-57 విభాగంలో 40 ఏళ్ల షర్మిలా ధన్‌ఖడ్ అసాధారణ ప్రదర్శన కనబర్చింది. ఆమె 9.81 మీటర్ల దూరం షాట్‌పుట్ విసిరి ఈ సీజన్‌లో తన అత్యుత్తమ ప్రదర్శన నమోదు చేసింది. దీంతో కామన్వెల్త్ పారా అథ్లెటిక్స్ చరిత్రలో భారత్‌కు తొలి స్వర్ణ పతకాన్ని అందించిన అథ్లెట్‌గా నిలిచింది. షర్మిల విజయం భారత బృందంలో ఆనందాన్ని నింపింది. అదే విభాగంలో పోటీ పడిన మరో భారత అథ్లెట్ శిల్పా శైలకు నాటకీయ పరిణామాల మధ్య కాంస్య పతకం దక్కింది. శిల్పా 7.26 మీటర్ల దూరం విసిరి తన వ్యక్తిగత అత్యుత్తమ ప్రదర్శన నమోదు చేసినప్పటికీ తొలుత నాలుగో స్థానంలో నిలిచింది. అయితే మూడో స్థానంలో నిలిచిన నైజీరియా అథ్లెట్ యుచారియా ఇయాజీ త్రోపై భారత బృందం అభ్యంతరం వ్యక్తం చేసింది. అధికారులు వీడియో పరిశీలించిన తర్వాత ఆ త్రోను ఫౌల్‌గా ప్రకటించారు. దీంతో నాలుగో స్థానంలో ఉన్న శిల్పాకు కాంస్య పతకం వరించింది.పురుషుల హైజంప్‌లో భారత అథ్లెట్ సర్వేష్ కుషారే మరో అరుదైన ఘనత సాధించాడు. 2.25 మీటర్ల ఎత్తు దూకి రజత పతకం గెలుచుకున్న సర్వేష్, కామన్వెల్త్ క్రీడల్లో హైజంప్ విభాగంలో రజతం సాధించిన తొలి భారతీయుడిగా చరిత్ర సృష్టించాడు. జమైకాకు చెందిన రొమైన్ బెక్‌ఫోర్డ్ కూడా 2.25 మీటర్లు దూకినా, కౌంట్‌బ్యాక్ నిబంధన ప్రకారం స్వర్ణ పతకం అతడిని వరించింది. అయినప్పటికీ సర్వేశ్? ప్రదర్శన భారత అథ్లెటిక్స్‌కు మరో గర్వకారణంగా నిలిచింది. వెయిట్‌లిఫ్టింగ్‌లో తెలుగు కుర్రాడు వల్లూరి అజయ్ బాబు అద్భుత పోరాటంతో రజత పతకం గెలుచుకున్నాడు. పురుషుల 79 కిలోల విభాగంలో పోటీ పడిన 21 ఏళ్ల అజయ్ స్నాచ్‌లో 149 కిలోలు, క్లీన్ అండ్ జెర్క్‌లో 181 కిలోలు ఎత్తి మొత్తం 330 కిలోలతో రెండో స్థానంలో నిలిచాడు. మలేషియాకు చెందిన ఎర్రీ హిదాయత్ మొత్తం 331 కిలోలు ఎత్తి స్వర్ణ పతకం సాధించగా, అజయ్ ఒక్క కిలో తేడాతో పసిడి అవకాశాన్ని కోల్పోయాడు. అయినప్పటికీ అతడి ప్రదర్శనపై క్రీడా అభిమానులు ప్రశంసలు కురిపిస్తున్నారు.మహిళల వెయిట్‌లిఫ్టింగ్‌లో కూడా భారత అథ్లెట్లు సత్తా చాటారు. 53 కిలోల విభాగంలో జ్ఞానేశ్వరి యాదవ్ రజత పతకం సాధించింది. స్నాచ్‌లో 88 కిలోలు, క్లీన్ అండ్ జెర్క్‌లో 111 కిలోలు ఎత్తిన ఆమె మొత్తం 199 కిలోలతో రెండో స్థానంలో నిలిచింది. నైజీరియాకు చెందిన ఒనోమే ఒమోలోలా స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. మహిళల 58 కిలోల వెయిట్‌లిఫ్టింగ్ విభాగంలో వింద్యారాణి దేవి కాంస్య పతకం సాధించింది. మొత్తం 199 కిలోల బరువు ఎత్తి మూడో స్థానంలో నిలిచిన ఆమె భారత ఖాతాలో మరో పతకాన్ని చేర్చింది. ఈ విభాగంలో నైజీరియాకు చెందిన రఫియాత్ ఫోలాషాడే లావల్ 229 కిలోలతో స్వర్ణం సాధించగా, కెనడాకు చెందిన ఆన్ సోఫీ టాషెరో రజత పతకం దక్కించుకుంది.అటు బాక్సింగ్ రింగ్‌లోనూ భారత బాక్సర్లు విజయాల పరంపర కొనసాగిస్తున్నారు. సోమవారం జరిగిన వేర్వేరు బౌట్లలో సచిన్ సివాచ్, అంకుశ్, సాక్షి చౌదరి తమ ప్రత్యర్థులను ఓడించి క్వార్టర్ ఫైనల్స్‌కు అర్హత సాధించారు. ముగ్గురు బాక్సర్ల ప్రదర్శనతో భారత జట్టుకు మరో పతకాల ఆశలు పెరిగాయి. మొత్తంగా కామన్వెల్త్ క్రీడల్లో భారత్ అన్ని విభాగాల్లో సమిష్టి ప్రదర్శన కనబరుస్తోంది. పారా అథ్లెటిక్స్‌లో చారిత్రక స్వర్ణం, అథ్లెటిక్స్‌లో రికార్డు రజతం, వెయిట్‌లిఫ్టింగ్‌లో వరుస పతకాలు, బాక్సింగ్‌లో విజయాలతో భారత బృందం ఉత్సాహంగా ముందుకు సాగుతోంది. ప్రస్తుతం భారత్ రెండు స్వర్ణాలు, ఐదు రజతాలు, మూడు కాంస్య పతకాలతో మొత్తం 10 పతకాలు సాధించి పతకాల పట్టికలో ఎనిమిదో స్థానంలో కొనసాగుతోంది. రానున్న రోజుల్లో మరిన్ని ఈవెంట్లు మిగిలి ఉండటంతో భారత పతకాల సంఖ్య మరింత పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇప్పటివరకు భారత క్రీడాకారులు కనబర్చిన పోరాట పటిమ, ఆత్మవిశ్వాసం దేశ అభిమానుల్లో కొత్త ఆశలు నింపుతోంది.